RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 126 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం,నవంబర్,7,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 126 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday,November,7,2025 | PAGES : 8 RS : 4 /- |



## భారత్-పాక్ శాంతి నావల్లే..

### 8 విమానాల కూల్చివేత.. ట్రంప్ నోట మళ్లీ అదే పాట

వాషింగ్టన్: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, తనవల్లే ఇరు దేశాల మధ్య శాంతి నెలకొందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తానని బెదిరించడంతోనే అణుశక్తి దేశాలైన భారత్, పాక్‌లు వెనక్కి తగ్గాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆ ఘర్షణలో కూల్చేసిన ఫైటర్ జెట్ల సంఖ్య ఏడు కాదని, ఎనిమిది అని కొత్త లెక్క చెప్పారు. తాను అధ్యక్షుడయ్యాక ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది ఘర్షణలను ఆపేశానని, అందులో భారత్–పాక్ వివాదం కూడా ఒకటని ట్రంప్ చెప్పుకొచ్చారు. "నేను భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నా ను. అదే సమయంలో వారు యుద్ధానికి సిద్ధమవుతున్నారని ఓ పత్రికలో చదివాను. ఏడు విమానాలు కూల్చివేశారని, ఎనిమిదోది తీవ్రంగా దెబ్బతిందని తెలిసింది. అంటే దాదాపు 8 విమానాలు కూలిపోయాయి.



## చిన్న నిర్లక్ష్యం కూడా వద్దు..

### పార్టీ నేతలు కలిసికట్టుగా పనిచేయాలి - సీఎం రేవంత్‌రెడ్డి

,తెలంగాణ దిశ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విష యంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డినాయకులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయం లో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛా ర్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు.ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహి స్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహి స్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి....ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.



## బండి సంజయ్‌బోరబండ ప్రచారానికి అనుమతి నిరాకరణ

### పోలీసుల తీరుపై మండిపడ్డ బిజెపి శ్రేణులు

హైదరాబాద్, నవంబర్6 : జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా చేయనున్న ప్రచారంలో భాగంగా బోరబండలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీటింగ్‌కు పోలీసులు అనుమతి రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ మీటిం గ్ గురువారం సాయంత్రం కొనసాగాల్సి ఉంది. తాజాగా ఆయన మీటింగ్ కు పర్మిషన్ ఇవ్వకపోవంతో పోలీసుల తీరుపై బీజేపీ శ్రేణుల మండిపడుతున్నాయి.



## సెంటిమెంట్ అన్నిసార్లూ పనిచేయదు

### - పీజేఆర్ విషయంలో బీఆర్ఎస్ సెంటిమెంట్ ఏమైందని కోమటిరెడ్డి ప్రశ్న

**హైదరాబాద్హైదరాబాద్,తెలంగాణ దిశ :**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సెంటిమెంట్ రాజకీయాలు అన్ని సమయాల్లో పనిచేయవని, ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేస్తారని ఆయన స్పష్టం చేశారు. 30 నుంచి 50 వేల ఓట్ల భారీ మెజార్టీతో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. "దివంగత నేత పీజేఆర్ చనిపోయినప్పుడు, ఆయన భార్యకు అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి మూడు గంటలు పట్టింది. అప్పుడు వారి సెంటిమెంట్ ఏమైంది? నిజంగా సెంటిమెంట్ పనిచేస్తే కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనే బీఆర్ఎస్ గెలిచి ఉండేది" అని అన్నారు.




## జూబ్లీహిల్స్ అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

- ఇందులో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాత్రా ఉంది
- ప్రచారంలో గత హామీలపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్
- సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదే
- ముస్లింలు కాంగ్రెస్‌కు ఇజ్జత్ అయితే.. మరి హిందువులో
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉప ఎన్నిక అంశంలో ఇంకా సర్వేలలో స్పష్టత లేదని చెప్పారు. సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమ ంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో భారత రాష్ట్రసమితికి మూడో స్థానం వచ్చింద న్న ఆయన.. ఓటర్లలో ఏ పార్టీకి ఓటు వేయాలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం లో 6 గ్యారంటీలను గానీ, 400 పైచిలుకు హామీల గురించి గానీ ఎక్కడా ప్రస్తావించ డం లేదని, వ్యక్తిగత విమర్శలు చేయడంపైనే దృష్టి పెడుతోందని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో అనేక సమస్యలున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఏ పార్టీకి ఓటు వేయాలనే దానిపై ఓటర్లు ఇంకా నిర్ణ యానికి రాలేదని..అందుకే సర్వేల్లోకూడా స్పష్టత లేదని కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ వెనుకబాటుకు గతం లో పాలించిన బిఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, గ్యారెంటీలపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదేనని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబంధించి ఒక పోస్ట్ ను కూడా కిషన్ రెడ్డి తన సోషల్ మీడియా అకౌంట్లో పెట్టారు.



## ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగితే ఎన్‌డిఏ కుప్పకూలుతుంది

పాట్నా: బీహార్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే, ఎన్‌డిఎ ప్రభుత్వం కుప్పకూలుతుందని కాంగ్రెస్‌నేత ప్రియాంకగాంధీ వ్యాఖ్యానించారు. గురువారం ఆమె బీహార్‌లో ఎన్నికల ర్యాలీ చేపట్టారు. దేశ అభివృద్ధికి అపారమైన కృషి చేసిన బీహార్ ప్రజల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వానికి గౌరవం లేదని అన్నారు. అభివృద్ధి పేరుతో కాకుండా మతం పేరుతో ఎన్‌డిఎకు ఓట్లు వేయాలని బిజెపి నేతలు ప్రజలను డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే, ఎన్‌డిఎ ప్రభుత్వం కూలిపోతుందని అన్నారు. పేదలు, మహిళలు, యువత కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేస్తారని అన్నారు. బీహార్‌లో గత మూడేళ్లలో 27 బ్రిడ్జీలు కూలిపోయాయని, ఎన్‌డిఎ ప్రభుత్వంలో మౌలికసదుపాయాల అభివృద్ధి కుంటుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## జూబ్లీ ఎన్నికల్లో కవిత ఎటూ..?

హైదరాబాద్హైదరాబాద్,తెలంగాణ దిశ : జూబ్లీహిల్స్ బైపోల్స్ వేళ గులాబీ పార్టీ శ్రేణుల్లో గుబులు మొదలైందంట. జాగృతి అధ్యక్షురాలు కవిత ఇష్యూ బీఆర్ఎస్‌లో హాట్ టాపిక్‌గా మారి ఆమె ప్రభావం ఉప ఎన్నికలలో పార్టీపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో అని క్యాడర్ ఆందోళన చెందుతోందంట. బీఆర్ఎస్ నేతలపై కవిత సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గులాబీ పార్టీ శ్రేణులు సతమతమవుతున్నట్లు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ జనంబాట పట్టిన కవిత:. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నా యి. అయితే బీఆర్ఎస్‌కు విపక్షాల కంటే జాగృతి అధ్యక్షురాలు కవితే పెద్ద గండంగా మారారంటున్నారు. కవిత గులాబీ పార్టీ నేతలను టార్గెట్ చేస్తూ జనంబాట పట్టారు. అటు కవిత వ్యవహారాన్నే ప్రచార అస్త్రంగా మలుచుకుంటోంది కాంగ్రెస్.. ఆ క్రమంలో భవిష్యత్తులోనూ భవిష్యత్తులోనూ కవిత వల్ల బీఆర్ఎస్‌కు సమస్యే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.. కవిత ఫీవర్‌తో సతమతమవు తున్న గులాబీ శ్రేణులు:. మొత్తానికి బీఆర్ఎస్‌కు కవిత ఫీవర్ పట్టుకున్నట్లే కనిపిస్తోంది.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ పార్టీలో కవిత అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆమె పార్టీకి దూరమైన తర్వాత హైదరాబాద్‌కే పరిమితం అవకుండా రాష్ట్రమంతటా అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నారు. సొంత పార్టీలో తనకు జరిగిన అన్యాయాలను తనను కలుస్తున్న నాయకులకు, కార్యకర్తలకు వివరిస్తున్నారు.




## వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి పుట్‌పాత్ కబ్జా

**ఖిలావరంగల్హైదరాబాద్,తెలంగాణ దిశ :** 'ఇటెడు రా అంటే ఇల్లంతా నాదే' అన్న సామెత వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ముఖ్యమైన దారి విషయంలో అక్షరాలా నిజమవుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు, ద్విచక్ర వాహనదారులకు దారి చూపాల్సిన ఈ మార్గం, ప్రస్తుతం కబ్జాదారులు పాగా వేయడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పాదచారుల కోసం రైల్వే శాఖ ప్రత్యేకంగా చిన్న సొరంగ మార్గం లాంటి ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేసింది. సాధారణ సమయాల్లో కంటే భారీ వర్షాలు వచ్చినప్పుడు నడక దారి ఎంతగానో ఉపయోగపడుతుంది. రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఒక మార్గంలో మురికి నీరు, మరో మార్గంలో తాగునీరు నిత్యం ప్రవహిస్తోంది.


# జగద్గిరిగుట్ట హత్య కేసులో నిందితుల అరెస్ట్

## హత్యకు ఉపయోగించిన కత్తి స్వాధీనం - సైబరాబాద్ ఎస్ఓటి, బాలానగర్, జగద్గిరిగుట్ట పోలీసుల సంయుక్త గాలింపులో పట్టుబడిన హంతకులు...



**కుత్బుల్లాపూర్, నవంబర్ 06, తెలంగాణ దిశ):** జగద్గిరిగుట్టలో బుధవారం జరిగిన హత్య కేసులో నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సైబరాబాద్ ఎస్ఓటి, బాలానగర్, జగద్గిరి గుట్ట పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు. ఈ విషయమై బాలానగర్ ఇంచార్జీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్. కోటిరెడ్డి గురువారం షాపూర్ నగర్ లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే టి. బాలశౌర్ రెడ్డి (21కి అదే ప్రాంతంలో నివసించే షరీఫ్ కు పాత గొడవలు ఉన్నాయి. దీంతో బుధవారం హత్య కాబడిన రోషన్ సింగ్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. షరీఫ్ కు అనుకూలంగా బాలశౌరి రెడ్డికి వ్యతిరేకంగా వ్యవహరించేవాడు. షరీఫ్ విషయంలో అతిగా ప్రవర్తిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ గతంలో రోషన్ సింగ్ బాలశౌరి రెడ్డిని హెచ్చరించాడు. దీంతో అతను తన మిత్రులైన జగద్గిరిగుట్ట నివాసి సయ్యద్ మహమ్మద్ (28), అదే కాలనీకి చెందిన రేవు ఆదిత్య అలియాస్ అదిల్ (26) లతో కలిసి రోషన్ సింగ్ ప్రాణాలతో ఉంటే తనకు ప్రమాదమని అతనిని హత్య చేయాలని వారి సహకారం కోరాడు. ఇందుకు వారు అంగీకరించడంతో బుధవారం సాయంత్రం సుమారు నాలుగు గంటలకు జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ వద్ద కు మాట్లాడుదాం అంటూ రోషన్ సింగ్ పిలిపించారు. రోషన్ సింగ్ అక్కడికి వచ్చిన తర్వాత ఇదే విషయమై బాలశౌరి రెడ్డి రోషన్ సింగ్ మధ్య వాగ్వివాదం పెరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన బాలశౌరి రెడ్డి తాను తెచ్చుకున్న కత్తితో రోషన్ సింగును పొట్టలో వీపు భాగంలో పలుమార్లు కత్తితో పొడిచి గాయపరిచాడు. ఇందుకు బాలశౌరి రెడ్డి స్నేహితుడు మహమూద్ రోషన్ సింగ్ ను వెనుక నుండి బలంగా పట్టుకోవడంతో బాలశౌరి రెడ్డి రోషన్ సింగ్ నుకత్తితో ఛాతి, కడుపు,వీపు భాగాలపై అనేకసార్లు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాడు. నడి రోడ్డుపై బాలశవరెడ్డి రోషన్ సింగ్ ను కత్తితో పొడుస్తున్న విషయమై చూసిన స్థానికులు అవాక్కై అక్కడి నుండి పరుగులు పెట్టారు. కొంతమంది దూరంగా ఉండి ఈ హత్యను సెల్ ఫోన్లలలో చిత్రీకరించారు. సంఘటనలో రోషన్ సింగ్ ఒంటి నుండి తీవ్ర రక్తస్రావం జరిగే రోడ్డుపైనే పడిపోయాడు. బాలశౌరి రెడ్డి నుండి విడిపించుకున్న రోషన్ సింగ్ తీవ్ర గాయాలతో అక్కడి నుండి దూరంగా పారిపోయాడు. వెంటనే అక్కడి నుండి బాలశౌరి రెడ్డి, సయ్యద్ మహమ్మద్, అదిల్ లు తాము తెచ్చుకున్న మోటార్ సైకిల్ రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనంపై పారిపోయారు. తీవ్ర గాయాలతో కిందికి పడిపోయిన రోషన్ సింగ్ ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటుఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమిం చడంతో పోలీసులు గాంధీ ఆసుపత్రి కి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి రోషన్ సింగ్ మృతిచెందాడు. మృతిచెందిన రోషన్ సింగ్ మృతి రీత్యా ఆటో డ్రైవర్ అయినా అతనిపై బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో రెండు కేసుల్లో నిందితుడు. ఇతనిపై రౌడీషీట్ ఉంది. హత్యకు పాల్పడిన బాలశౌరి రెడ్డి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో మూడు కేసులలో నిందితుడు. ఇతనిపై జగద్గిరిగుట్ట పోలీసులు రౌడీ షీట్ నమోదు చేశారు. నిందితులు ఒక రహస్య ప్రదేశంలో ఉండగా సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులు, బాలానగర్, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుండి హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకల షర్టు, హత్యకు ఉపయోగించి పారిపోయిన రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనం, సెల్ ఫోన్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాలలో ఇలాంటి దారుణాలు జరిగినప్పుడు స్థానికులు సెల్ ఫోన్ లలో చిత్రీకరించడం కంటే పోలీసులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని డిసిపి కోటిరెడ్డి ప్రజలకు సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎవరినైనా చట్ట పరిధిలో కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే సకాలంలో స్పందించి నిందితులను అరెస్టు చేసిన పోలీసులను ఆయన అభినందించారు. విలేకరుల సమావేశంలో జగద్గిరిగుట్ట, బాలానగర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## బాచుపల్లి తెలుగు యూనివర్సిటీలో ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య



**కుత్బుల్లాపూర్, నవంబర్ 06, (తెలంగాణ దిశ) :** బాచుపల్లి తెలుగు యూనివర్సిటీలో బ్యాచిలర్స్ ఆఫ్ డిజైనింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పరశురాం (22) తాను ఉంటున్న వసతి గృహంలో గురువారం సాయంత్రం తాడుతో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే పరశురాం ఆత్మహత్యకు కారణాలను తోటి విద్యార్థులు, అధ్యాపకులు చెప్పలేకపోతున్నారు. ఈ సంఘటనతో కళాశాలలోని వసతి గృహంలో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు తెలుగు యూనివర్సిటీ వసతిగృహంలోని సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పరశురాం స్నేహితులు, హాస్టల్స్ సిబ్బంది, వసతి గృహం సిబ్బందిని వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి పరశురాం బంధువులకు సమాచారాన్ని చేరవేశారు. అయితే విద్యార్థి పరుశురాం ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి పురస్కారాల కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 06, (తెలంగాణ దిశ) :**రాష్ట్ర స్థాయి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం-2025 సందర్భంగా రాష్ట్ర స్థాయి పురస్కారాల కోసం జిల్లాకు చెందిన అర్హులైన దివ్యాంగులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని మహిళ, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ శాఖ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధికారి ఒక ప్రకటనలో కోరారు.

అర్హులైన వారు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మహిళ, శిశ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో లేదా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ అధికారి పరిశీలించి, డైరెక్టర్ హైదరాబాద్ కు పంపిస్తామని తెలిపారు. జిల్లాలోని అర్హులైన వ్యక్తులు, సంస్థలు **https://wdsc.telangana.gov.in/** లేదా **https://wdsc.telangana.gov.din/Notifications/Guidelines 20 for 20 State20 Awards** ఆన్ లైన్ వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కాంట్రాక్టర్లకు నవంబర్ లోగా బిల్లులు చెల్లించకపోతే డిసెంబర్ నుంచి పనులు ఆపేస్తాం

### - తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డికి వినతి



**హైదరాబాద్, నవంబర్ 06, (తెలంగాణ దిశ) :**కాంట్రాక్టర్లకు నవంబర్ లోగా బిల్లులు చెల్లించకపోతే డిసెంబర్ నుంచి పనులు ఆపేస్తామని తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డికి తెలిపారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు డివిఎన్. రెడ్డి, తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ యు. సురేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా రహదారులు, భవనాలు, పంచాయతీ రాజ్, నీటిపారుదల, ఆర్థిక శాఖల కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించినట్లు రాష్ట్ర చైర్మన్ యు. సురేందర్, జాతీయ ఉపాధ్యక్షులు డి. వివిఎన్.రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు గత కొన్ని సంవత్సరాలుగా పూర్తి చేసిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగిస్తున్న పనుల బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు తమ ఆస్తులను తాకట్టు పెట్టి రుణాలు తీసుకొని ప్రజా పనులు పూర్తి చేశారని గుర్తు చేశారు. అయితే బకాయిలు విడుదల కాకపోవడంతో వారిపై తీవ్ర ఆర్థిక భారం పడిందని తెలిపారు. నాన్-ప్రియారిటీ వర్క్స్ ను ముందస్తుగా ముగించి తుది బిల్లులను సిద్ధం చేయాలని కోరారు. నాన్- ప్రియారిటీ తో ముగిసిన పనులకు సంబంధించిన బ్యాంకు గ్యారంటీలను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాను ఖరారు చేసి, ఆ పనులకు నిధులు సమయానికి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో నవంబర్ చివరి నాటికి వివిధ విభాగాల కార్యదర్శులతో పాటు బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణా రావును కోరారు. నవంబర్ చివరి వరకు సమస్యకు పరిష్కారం లభించకపోతే డిసెంబర్ 1వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పనులు నిలిపి వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు హెచ్చరించారు. కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించడం రాష్ట్ర ప్రజా పనుల నిరంతర కొనసాగింపుతో పాటు అభివృద్ధి కార్యక్రమాల పురోగతికి అత్యంత అవసరమని వారు ప్రభుత్వానికి సూచించారు.

## శాంతియుత జగద్గిరిగుట్ట కోసం ప్రతి ఒకరు కృషి చేయాలి

### - అఖిలపక్ష నాయకుల పిలుపు





**కుత్బుల్లాపూర్, నవంబర్ 06, (తెలంగాణ దిశ) :** జగద్గిరిగుట్టలో బుధవారం నాడు జరిగిన హత్య ఘటన చాలా దారుణమని సభ్య సమాజం భయభ్రాంతులకు గురైందని ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల పక్ష బృందం కోరింది. ఇందుకు పోలీస్ అధికారులు కూడా సహకరించాలని కోరుతూ గురువారం అఖిలపక్ష నాయకులు అంబేద్కర్ విగ్రహం దగ్గర సంఘటనను ఖండించారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట సబ్ ఇన్స్పెక్టర్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట అంటే మినీ తెలంగాణగా పేరు పొంది రాష్ట్ర, దేశ వ్యాప్తంగా వలస వచ్చే కార్మికులకు నిలయంగా అందరూ కలిసిమెలిసి జీవించే ప్రాంతమని అన్నారు. కానీ నేడు గంజాయి కారణంగా జగద్గిరిగుట్టలో దాడులు, హత్యలు గత మూడు సంవత్సరాల నుంచి జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల జగద్గిరిగుట్టకు చెడ్డ పేరు రావడమే కాకుండా ఇక్కడికి కొత్త వాళ్లు రావడానికి ఇబ్బంది పడితే రాబోయే రోజుల్లో జగద్గిరిగుట్ట ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా జగద్గిరిగుట్ట వాసులందరూ రాజకీయాలకతీతంగా కలిసి వచ్చి అన్ని బస్తీలలో బస్తీ పెద్దలు, యువకులు కలిసి గంజాయి నిరోధక కమిటీలు ఏర్పాటు చేసి గంజాయి బస్తీలలోకి రాకుండా చేయగలిగితే ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగవని అన్నారు. మంచి శాంతియుత వాతావరణం ఏర్పడి ప్రజలు సంతోషంగా కలిసి మెలిసి జీవించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరం మన బాధ్యతగా ఈ పోరాటంలో కలిసి రావాల్సిందిగా కోరారు. బస్తీలలో ఖాళీగా ఉన్న ప్రదేశాలలో గస్తీని మరింత తీవ్రతరం చేయాలని గంజాయి లభించిన వారిని , అమ్మిన వారిని ఈ ప్రాంతంలో ఉండకుండా బహిష్కరించాలని కోరారు. దానికి బస్తీ వాసులందరూ సహకరించాలని కోరారు. జగద్గిరిగుట్టను గంజాయి లేని ప్రాంతంగా నిర్మించడంలో పోలీసులే బాధ్యత వహించి పౌర సమాజాన్ని కదిలించాలని కోరారు. జగద్గిరిగుట్టలో గంజాయిని లేకుండా చేయడానికి ఈ నెల 11న అన్ని బస్తీ కమిటీల తోటి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, కాంగ్రెస్, టిఆర్ఎస్, ఏఐటియుసి, జనసేన, ఎం ఆర్ పి ఎస్, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు చెకుముకి సైన్స్ ఫేస్ట్

### - నాగారం ప్రభుత్వ పాఠశాలలో 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పరీక్షలు

### - గోడ పత్రిక ఆవిష్కరణలో కీసర ఎంఈఓ జమదగ్ని




**కీసర, నవంబర్ 06, (తెలంగాణ దిశ) :**విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతో దోహదం చేస్తాయని కీసర ఎంఈఓ జమదగ్ని అన్నారు. గురువారం కీసర మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో చెకుముకి సంబరాలు 2025 గోడ పత్రిక ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జమదగ్ని మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో చెకుముకి సంబరాల పేరుతో సైన్స్ ఫేస్ట్ ను నిర్వహించడం అభినందనీయం అన్నారు. పాఠశాల స్థాయిలో విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు, ప్రతిభాపాటవా పోటీలు, పరీక్షలను నిర్వహించడం ద్వారా విద్యార్థులలో ప్రతిభ వెలికితీయవచ్చునని పేర్కొన్నారు. జెవివి నాయకులు శేషగిరిరావు మాట్లాడుతూ చెకుముకి పరీక్షలు ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడంతోపాటు వారిలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నమని అన్నారు. నాగారం ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లాస్థాయిలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా డిసెంబర్ 12, 14 తేదీలలో కరీంనగర్ లో రాష్ట్రస్థాయి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జెవివి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీసీ బిడ్డ నవీన్ యాదవ్ గెలిపించుకోవాలి






**కుత్బుల్లాపూర్, నవంబర్ 06, తెలంగాణ దిశ) :**జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీసీ బిడ్డకు అవకాశం వచ్చినందున బీసీ నాయకులు, ప్రజలు బీసీ బిడ్డకు సంపూర్ణంగా మద్దతు ఇచ్చి గెలిపించుకోవాలని బీసీ నేతల కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని మధురానగర్ లో గురువారం జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. వీరితో పాటు ప్రముఖ సినీ నటుడు సుమన్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, హస్త కళ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు, సత్యనారాయణ గౌడ్, గౌడ సంఘం నాయకులతో కలిసి గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల అభివృద్ధికి కాంగ్రెస్పి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదాని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు, గౌడ కులస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రైటర్ పై అవినీతి తరచూ ఫిర్యాదులు : ఏసీబీ దాడులు



**కుత్బుల్లాపూర్, నవంబర్ 06, (తెలంగాణ దిశ) :** కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల అవినీతిపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. డాక్యుమెంట్ రైటర్లు లేనిదే రిజిస్ట్రేషన్ జరగడం లేదని తరచూ ఫిర్యాదుల వస్తున్న నేపథ్యంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై తనిఖీలు నిర్వహించినట్లు హైదరాబాద్ ఏసీబీ డీఎస్పి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో సూరారంలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో 15 మందికి పైగా డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోనే స్లాట్ బుకింగ్ కంటే ఎక్కువ డాక్యుమెంట్ల కలిగి ఉండడం పై అధికారులు దృష్టి సారించారు. తనిఖీల సందర్భంగా ఒక డాక్యుమెంట్ రైటర్ వద్ద దొరికిన రూ. 10 వేలు ఎక్కడివన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు ఉండడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## సంపాదకీయం

### న్యాయమూర్తులపై పని ఒత్తిడి

మనదేశ జనాభాకు తగ్గట్లుగా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన తక్షణ అసవరం ఉంది. ఇప్పటికే కేసుల సంఖ్యపెరుగుతోంది. ఒక్కో కేసుకు దశాబ్దాల సమయం పడుతోంది. న్యాయమూర్తులపై ఒత్తిడి పెరుగుతోంది. రోజువారీ కేసులకే సమయం సరిపోవడం లేదు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో సుప్రీంకోర్టుకు 34 మంది న్యాయమూర్తులు సరిపోతారా.. అనేది కీలక ప్రశ్న. ఇక హైకోర్టుల్లో 63 లక్షలకుపైగా, దిగువ కోర్టుల్లో దాదాపు ఐదు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ కేసులు కొండలా పేరుకుపోవడం ఆందోళనకరం. అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే ఎన్నడూలేనంత అత్యధికంగా 88,417 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయం ఆలస్యం కావడమంటే న్యాయం జరగకపోవడమే అనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎందుకంటే అండర్ ట్రయల్ ఖైదీలు కేసులు తెమలక ఏళ్లుగా జైళ్లల్లో మగ్గుతున్నారు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కినా ఏళ్లతరబడి కేసులు తెమలడం లేదు. రాజకీయ కేసులు తప్ప క్రిమినల్ తదితర కేసులు తేల్చడం లేదు. ఈ క్రమంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలి. సుప్రీం కోర్టు బెంచ్‌లను పెంచాల్సిన అవసరాన్ని గుర్తించాలి. కోర్టుల్లో తగినంతమంది న్యాయమూర్తులను, సిబ్బందిని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. లోక్ అదాలత్‌లు లాంటివి నిర్వహించి ఇరుపక్షాలు అంగీకరించిన కేసులను పరిష్కరిస్తే కోర్టులపై ఒత్తిడి తగ్గుతుంది. తీర్పులకు సమయం నిర్దేశిరచాలనే వాదన కూడా వుంది. న్యాయస్థానాలకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన కేంద్రం అనేక సందర్భాల్లో అడ్డుపడటం, అడ్డగోలుగా విమర్శలు చేయడం పరిపాటిగా వుంది. న్యాయమూర్తుల నియామకానికి ప్రత్యేకంగా ఒక జ్యుడీషియల్ కమిషన్ ఉండాలన్న చర్చ చాలాకాలంగా వుంది. అయితే నేడు కొలీజియం వ్యవస్థ ఆ బాధ్యత నిర్వహిస్తోంది. కాని కేందప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం నియామకాలను తీవ్రంగా జాప్యం చేస్తోంది. ఏవో సాకులు చూపి తిరస్కరిస్తోంది. ఇంకొన్ని సందర్భాల్లో కొలీజియం, కేంద్ర న్యాయశాఖ మధ్య వివాదాస్పదం అవుతున్నవే వున్నాయి. భారత రాజ్యాంగం, పాలన, శాసన, న్యాయ వ్యవస్థల మధ్య స్పష్టమైన లక్ష్మణరేఖలను నిర్దేశించింది. పాలకులు వాటిని ఉల్లంఘించిన సందర్భాల్లోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. నాగరిక సమాజంలో సత్వర న్యాయం అందించడం వ్యవస్థ బాధ్యత. అందుకోసం సుప్రీంకోర్టు తీసుకుంటున్న చొరవకు కేంద్రం వీలైనంత తోడ్పాటు నందించాలి. అప్పుడే పెండింగ్‌కు అడ్డుకట్టపడటంతోపాటు సత్వర న్యాయం అందేందుకు అవకాశముంటుంది. ఎందుకంటే ఇటీవల హైదరాబాద్ జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ కేసులో దాదాపు 17 ఏళ్ల నిరీక్షణ తరవాత పరస్పర విరుద్ధ తీర్పులు వచ్చాయి. జస్టిస్ ఎన్‌వి రమణ ఇచ్చిన తీర్పుకు భిన్నంగా మళ్లీ తదుపరి సిజెఐ తీర్పు వచ్చింది. దీనిపై అప్పీల్‌కు వెళితే కేసును కొట్టివేశారు. ఇది సమాజంలో ఓ పేదవర్గాల కోసం ప్రభుత్వం అనుసరించి గృహ సంబంధ విషయం. దీంతో జర్నలిస్టులు రోడ్డున పడ్డారు. ఇందులోని మెరిట్స్‌ను గుర్తించక పోవడంతో జర్నలిస్టులు ఆందోళనకు కారణమయ్యింది. కేసులో ప్రభుత్వం కూడా గట్టిగా వాదనలు ఇవ్వలేకపోయింది. జర్నలిస్టులకు 17 ఏళ్ల క్రితం ఎందుకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి వచ్చిందో ధర్మాసనం ముందుంచ లేపోయింది. కేసు వేసిన వారు సైతం జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను తెలుసు కోకుండా కోర్టుకు వెళ్లారు. ఇదంతా ఎందుకుంటే కేసు ఏదాదిలోనే తేలివుంటే సమస్య వచ్చేది కాదు. అప్పుడే ప్రభుత్వాలు తగిని నిర్ణయాలు తీసుకునే వీలుండేది. కేవలం కోర్టుల్లో దశాబ్దన్నరం కాలంగా నలిగిపోచి చివరకు అన్యాయం జరగడంతో తమ సమస్యలపై నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం లోపం కూడా ఉంది. అందుకే కేసులు సత్వరంగా పరిష్కారం కావాలంటే న్యాయమూర్తుల సంఖ్యను ఇప్పుడున్న దానికి కనీసం పదివంతులు పెంచాలి. అప్పుడు త్వరగా పరిష్కారం దక్కుతుంది. జైళ్లలో మగ్గుతున్న ఎందరికో ఊరట కలుగుతుంది. లేకుంటే కేసులు తేలకుండానే ట్రయల్ ఖైదీలు జైళ్లల్లో మగ్గాల్సి వస్తోంది. జాతీయ జ్యుడీషియల్ గ్రిడ్ ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం 69,605 సివిల్, 18,887 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2020 వేసవి సెలవుల సమయంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రస్తుత సిజెఐ బిఆర్ గవారు వేసవి సెలవుల్లోనూ పాక్షికంగా పనిచేసే పద్ధతిని తీసుకొచ్చారు. కొల్‌కతా, మహారాష్ట్ర హైకోర్టుల్లో కేసుల పెండింగ్ అత్యధికంగా ఉంది. జనాభాతో పోల్చితే న్యాయమూర్తుల నిష్పత్తి ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే మనదేశంలోనే అత్యంత తక్కువగా ఉండటం కేసుల పెండింగ్‌కు కారణమవుతోందన్న వాదన ఉంది. . అమెరికాలాంటి దేశాల్లో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 150 మంది వరకూ న్యాయమూర్తులుండగా, మన దేశంలో 21 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. కోర్టుల్లో కేసులు భారీగా పెరిగిపోవడానికి అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ కేసులతో న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దేశంలో కార్పొరేట్, అవినీతి, నేరగ్రస్థ రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. చట్టసభల సభ్యుల్లో 45 శాతం మందికిపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాధాన్యతా క్రమంలో చట్ట సభల సభ్యులు, అధికారులపై కేసులను పరిష్కరించడం కూడా అత్యవసరం. ఇక ఇతర కారణాల విషయానికి వస్తే న్యాయవాదులు తరచూ వాయిదాలు కోరడం, స్థానికంగా పరిష్కరించదగినవి కూడా కోర్టులకు తీసుకురావడం తదితర కారణాల వల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగిపోతున్నాయి. రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలు సివిల్ కేసుల విషయంలో వినియోగించుకుని సుదీర్ఘకాలంగా వాయిదాలున్న కేసుల సంగతి తేల్చాలనే సూచన ఉంది. ఏదేమయినా ఈ విషయంలో కేంద్రం ఇక ఎంతమాత్రం ఉపేక్షించకుండా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచి , కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రయత్నం చేయాల్సి ఉంది.

# బిసి బిల్లును తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి

### - కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయాలి - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావును కోరిన 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి



**హైదరాబాద్, నవంబర్ 06, (తెలంగాణ దిశ)** :బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లుల తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చడంతో పాటు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని కోరుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ లో 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షులు, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు, వైస్ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు ఇందులో భాగంగా సాధన సమితి పిలుపు మేరకు ఇప్పటికే సుమారు 25 మండలాలతో పాటు 20 జిల్లా కేంద్రాలలో అధికారులకు వినత్ పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లు నెంబర్ 3, 4 ద్వారా మార్చి 2025 లో విద్యా ఉద్యోగాలు స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ ను 42 శాతానికి పెంచుతూ చట్ట సభల్లో ఆమోదించిందని తెలిపారు. ఈ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత కేంద్రం వద్ద గత ఏడు నెలలుగా తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చడానికి పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. తొమ్మిదో షెడ్యూల్ లో కేంద్ర ప్రభుత్వం బిల్లును చేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని ఒత్తిడి చేయాలని వారు కోరారు. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లులను తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ వారు డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్స్ లో ఉప వర్గీకరణ చేయాలని, అత్యంత వెనుకబడిన వర్గాలకు సామజిక న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. అదేవిధంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారని మొదటి సంవత్సరంలో కేటాయించిన రూ. 9, 200 కోట్లలో కేవలం రూ. 2,068 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా ఖర్చులు అలాగే ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం బీసీల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం మొత్తం రూ. 40 వేల కోట్లు తక్షణమే అనగా ఈ ఆర్థిక సంవత్సరం లోగా ఖర్చు చేయాలని వారు కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో చేసిన అన్ని హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ వారు కోరారు. రాష్ట్రంలోని అన్ని నామినేటెడ్ పోస్టులు, కమిషన్లు, బోర్డులు, సలహా మండళ్లలో 90 శాతం ప్రాతినిధ్యం బీసీ, ఎస్ సి, ఎస్ టి లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, తగు ప్రాతినిధ్యం, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమని నమ్ముతున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని సానుకూలంగా స్పందించాలని వారు కోరారు.

# ఎన్నికల ప్రచారంలో డప్పు కొట్టి దరువేసిన మొగిలి సునీత రావు





**జూబ్లీహిల్స్, నవంబర్ 06, (తెలంగాణ దిశ)** :జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షు రాలు మొగిలి సునీత రావు అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ వెంగళ్ రావు నగర్, శాస్త్రి నగర్, ఎర్రగడ్డలలో మొగిలి సునీత రావు మహిళా కాంగ్రెస్ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం గా కళాకారులతో కలిసి డప్పు కొట్టి నృత్యం చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ప్రజలు నవీన్ యాదవ్ కు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నవీన్ యాదవ్ విజయానికి సోపానాలని అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు ద్వారా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నవీన్ యాదవ్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఒక నాయకుడిగా ప్రజలకు ఎంతో సేవ చేసినా నవీన్ యాదవ్ ను గెలిపించుకుంటే ఎమ్మెల్యేగా మరిన్ని సేవలు అందిస్తారని చెప్పారు. ప్రజల మనిషి నవీన్ యాదవ్ ను భారీ మెజారి టీతో గెలిపించాలని సునీత రావు ఓటర్లను కోరారు. మీ కుటుంబంలో ఒక సభ్యుడుగా ఉన్న నవీన్ యాదవ్ చెయ్యి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గడప గడపకు ప్రచారం చేసారు. బిజెపి, బిఆర్ఎస్ చెప్పే మాటలను నమ్మవద్దని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ లో గత పది సంవత్సరాల నుండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం పనిచేసే నాయకుడు నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్స్, బ్లాక్ ప్రెసిడెంట్ లు. డివిజన్ ప్రెసిడెంట్స్ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న కండక్టర్



**కుషాయిగూడ, నవంబర్ 06, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ డిపో 16ఎ/5కె రోట్ లో గురువారం డ్యూటీ చేసిన కండక్టర్ షేక్ అబ్దుల్ అలీం ఈ236095 అంబేద్కర్ నగర్ నుండి మెహిదిపట్నం సర్వీస్ చేయుచుండగా ఒక మహిళ పర్సు దొరికింది. అతను దానిని చూసి డ్రైవర్ సమక్షంలో అందులో ఏమున్నాయో అని చూడగా అందులో రూ. ఏడు వేల నగదు, బీరువా తాళాలు, హాస్పిటల్ చిట్టి ఉన్నాయి. చిట్టి పైన ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా కాల్ చేయగా తను ఇందిరా దుబాయ్ బిల్డింగ్ వద్ద బస్సు ఎక్కి నాగారం స్టాప్ లో దిగానని, దిగి చూస్కోగా పర్సు లేదని గమనించి చాలా బాధపడ్డారని తెలిపింది. ఇంతలో కండక్టర్ నుంచి ఫోన్ రావడంతో పోయిన పర్సు దొరికిందని సంతోషం వ్యక్తం చేసింద. ఆ తదుపరి కండక్టర్ డిపో కి వచ్చి తీసుకు వెళ్ళమని చెప్పారు. దీంతో డిపోలో కుషాయిగూడ డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ చేతుల మీదుగా పర్సు ను తిరిగి ఇచ్చారు. మేనేజర్ తో తను పూస్తేలు తాళిని కుద పెట్టీ కుమారుడి దవాఖాన ఖర్చు కొరకు రూ. ఏడు వేలు అప్పు తీసుకున్నానని తెలిపింది. అది కాస్త పోగుట్టుకొని తిరిగి కండక్టర్ రూపంలో దేవుడు పర్సును తిరిగి ఇచ్చాడని కన్నీటి పర్వంతరం అయ్యారు. ఆర్టీసీ అంటే నిజాయితీ కల్గిన సంస్థ అని డిపో మేనేజర్ కు, కండక్టర్ కు. ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# సాయినగర్ లో వైన్స్ ఏర్పాటు చేయ వద్దని కోరుతూ ధర్నా..., రాస్తారోకో..., ఉద్రిక్తత





**కుషాయిగూడ, నవంబర్ 06, (తెలంగాణ దిశ)** : సాయినగర్ లో వైన్స్ ఏర్పాటు చేయవద్దని కోరుతూ కాలనీ వాసులు గురువారం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. నాగారం కుషాయిగూడ ప్రధాన రహదారిపై "యార్డ్ డ్రైవ్ ఇన్ మోర్" లో వైన్స్ ఏర్పాటు కోసం జరుగుతున్న ప్రయత్నాలపై జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పనులను నిలిపివేశారు. అనంతరం నాగారం కుషాయిగూడ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను శాంతింప చేశారు. దీంతో వైన్స్ షాపు ఏర్పాటు చేస్తున్న ప్రాంగణం ఎదుట ఆందోళనకారులు మళ్ళీ ధర్నాకు దిగారు. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులతోపాటు సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో నో కింగ్స్ ఉద్యమం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2.0 పాలనపై ఏడాది తిరగకుండానే అమెరికాన్లు తిరుగుబాటు షురూ చేశారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. మొదటి రోజు నుంచే సంచలన నిర్ణయాలు. అడ్మినిస్ట్రేటివ్ ఆర్డర్లు జారీ చేస్తూ అందరిలో భయం సృష్టించారు. రోజురోజుకూ తన పరిధిని మించి నిర్ణయాలతో ఇటు అమెరికన్లు.. అటు ప్రపంచ దేశాలు నిత్యం భయప దుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వ్యతిరేక శక్తులు పెరుగుతున్నా యి. తన నిర్ణయమే ఫైనల్ అన్నట్లు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఇదే తరుణంలో ట్రంప్ వేధింపులతో విసిగిపోయిన అమెరికన్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉద్యమం మొదలు పెట్టారు. అక్టోబర్ 18న అమెరికా అంతటా, అలాగే మిత్ర దేశాల్లోనూ 'నో కింగ్స్' పేరుతో భారీ నిరసనలు జరిగాయి. ఇది కేవలం రాజకీయ కార్యక్రమం కాదు.. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఉద్యమంగా నిరసనకారులు పేర్కొంటున్నారు. దాదాపు 2,700 నగరాల్లో ఆందోళనలు జరగడం అమెరికా అధ్యక్షుడిపై వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇందులో సుమారు 70 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి ప్రేరణ.. 2016లో ప్రారంభమైన 'ఇండివైజబుల్' అనే సంస్థ నుండి వచ్చింది, ఇది మొదట ట్రంప్ అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడింది. ఇప్పుడు, వేలాది సంస్థలు కలిసి ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తున్నాయి. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్, టీచర్స్ ఫెడరేషన్, మూవ్ ఆన్ వంటి సంస్థలు ఇందుకు తోడ్పడుతున్నాయి. తాజాగా ఉద్యమకారులు.. ఒక కొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టారు. దేశంలో కనీసం 3.5 శాతం ప్రజలు స్థిరంగా వీధుల్లోకి దిగితే ప్రభుత్వం మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇది ఎరికా చెనోవెత్, మారియా స్టీఫెన్ వంటి రాజకీయ శాస్త్రవేత్తల పరిశోధన ఆధారంగా రూపొందించారు. ఈ సిద్ధాంతం ఉద్యమానికి శాస్త్రీయ చట్టబద్ధతను ఇచ్చినా, దానికీ పరిమితులు ఉన్నట్టు నిపుణులు కూడా సూచిస్తున్నారు. ప్రజలు, స్వతంత్ర సంస్థలు ట్రంప్‌పై అనేక ఆరోపణలు చేస్తున్నారు. పాలనా తీరుపై అభ్యంతరాలు చెబుతున్నారు. వలసదారుల నిర్బంధం, బహిష్క రణను వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగ సంస్థలపై ఆధిపత్యం చెలాయిం చడాన్ని నిరసిస్తున్నారు. నేషనల్ గార్డ్స్‌ను నగరాలకు నియమించడాన్ని తప్పు పడుతున్నారు. ప్రజా ధనాన్ని తన సొంత అవసరాలకు వాడుకో వడంపై మండిపడుతున్నారు. కోర్టుల తీర్పులను లెక్కచేయకపో వడంపైనా జనాగ్రహం పెల్లుబిగుస్తోంది. పెట్టుబడిదారుల అనుకూల ఆర్థిక విధానాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్నట్లు అమెరికన్లు భావిస్తున్నారు.

# మల్లాపూర్ లో ఘనంగా సదర్ సమ్మేళనం



**మల్లాపూర్, నవంబర్ 06, (తెలంగాణ దిశ)** :కార్తీక పౌర్ణమి పండుగ సం దర్భంగా మల్లాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదర సోదరీమణులకు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ గ్రామ పెద్దలు, మల్లాపూర్ యాదవ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# 8 ఏళ్ల పాటు ఒంటరి పోరాటం చేసిన శివరంజని

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** పట్టువదలని విక్రమార్కుడి కథలు మనం చిన్నప్పుడు చదువుకిని ఉంటాం.. కానీ హైదరాబాద్‌కు చెందిన పిల్లల వైద్యురాలు శివరంజని సంతోష్ చేసిన పోరాటం.. దేశ ఆరోగ్య విభాగాన్ని కదిలించింది. సమాజపు ఆరోగ్య పరిరక్షణ కోసం, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం కోసం గళం వినిపించిన ఆమె ప్రయత్నాలు ఫలాన్నిచ్చాయి. ఆమె సాధించిన విజయం ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఫుడ్ సేఫ్టీ కమిషనర్లు మరియు లైసెన్స్ అధికారి?లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది: "ఇకపై ఎలాంటి ఫుడ్ ప్రొడక్ట్స్‌పై అనే పదాన్ని వాడకూడదని నిర్దేశించింది. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన శివరంజని 8ఏళ్లపాటు పోరాటం చేశారు. ఆమె పోరాటం ఫలించి ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ ఫిల్మ్ నగర్ ప్రాంతంలో చిన్నపిల్లల క్లినిక్ నిర్వహిస్తున్న డాక్టర్ శివరంజని. లేబుల్‌తో టెట్రా ప్యాక్‌లలో విక్రయిస్తున్న ఎనర్జీ డ్రింకులు ఆరోగ్యానికి హానికరం అని గుర్తించారు. వాటి విక్రయాలు ఆపేయాలని... పేరు తీసేయాలని ఆమె డిమాండ్ చేస్తూ..వచ్చారు. దీనిపై 8ఏళ్ల పాటు సుదీర్ఘంగా పోరాటం చేశారు. ఎట్టకేలకు అక్టోబర్ 14న అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆర్డర్ వచ్చిన వెంటనే డాక్టర్ శివరంజనీ భావోద్వేగానికి గురయ్యారు. 8 ఏళ్లపాటు తాము ఎంత పోరాటం చేసిందీ తలుచుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. "ఇది నాకు చాలా పెద్ద రిలీఫ్‌గా ఉంది. ఇన్నేళ్ళుగా ప్రైవేటు కంపెనీలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాయి. అసలు అనేది ప్రాణాలు కాపాడే ఔషధం. దీన్ని తప్పుడు లేబులింగ్, వక్రీకృత మార్కెటింగ్ ద్వారా సంప్రదించి, అసలు దీన్ని తీసుకుంటే ? ముఖ్యంగా పిల్లలకు, పెద్దలకు డయేరియా మరింత ముదిరేలా చేస్తుంది. ఈ అవినీతి మీద పోరాటం ఇప్పుడు ఫలితాన్నిచ్చింద"న్నారు. అధిక చక్కెరవున్న డ్రింక్స్ ను అనే పేరు ద్వారా ప్రజలకు అమ్మడమే కాకుండా, ఔషధాలుగా ప్రచారం చేశారు. "ఒకవైపు మన దేశంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో 13% మరణాలకు డయేరియా కారణమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పేరుతో పిల్లలకు తప్పు సమాచారం ఇచ్చిన వారిని ఎలా క్షమించ గలం?" అని డా. శివరంజని ప్రశ్నించారు.ప్రపంచవ్యాప్తంగా అనేది చికిత్స కోసం ఉపయోగించే ప్రత్యేకమైన ఫార్ములా. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ చేసిన ఫార్ములా ప్రకారం లీటర్‌కు 2.6 గ్రాములు సోడియం క్లోరైడ్, 1.5 గ్రాముల పొటాషియం క్లోరైడ్, 2.9 గ్రాముల సోడియం సిట్రేట్, 13.5 గ్రాముల డెక్స్ట్రోస్ ఉండాలి.వంటి పరిస్థితులలో భద్రతగా శరీరాన్ని రక్షించడానికి, ఒత్తిడిని తగ్గించడానికే కేటాయించారు. శరీరం నీరసించిపోయి నప్పుడు.. లవణాలను ఎక్కువుగా కోల్పోయి నప్పుడు వైద్యులు దీనిని సిఫారసు చేస్తారు. కానీ ఇదే పేరుతో మార్కెట్‌లో చాలా ఎనర్జీ డ్రింకులు వచ్చేశాయి.

# మాదాపూర్ లో 'సైబర్ జాగరూక్త దివస్' ప్రత్యేక అవగాహన : ఏసీపీ శ్రీధర్




**శేరిలింగపల్లి, నవంబర్ 06,(తెలంగాణ దిశ):** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు "సైబర్ జాగరూక్త దివస్" లో భాగంగా మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరు ప్రాంతాలలో సైబర్ క్రైమ్ పై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం దుర్గం చెరువు వాకింగ్ ఏరియాలో వాకర్స్‌తో సమావేశమై మాదాపూర్ డీసీపీ రీతిరాజ్ ఆదేశాల మేరకు మాదాపూర్ డివిజన్ ఏసీపీ శ్రీధర్ వివిధ రకాల సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హైటెక్స్‌లోని నాగ్లో కన్స్ట్రక్షన్స్ వద్ద విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. అలాగే డబ్ల్యూ త్రీ గ్లోబల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ, ఎస్-యూనివర్సిటీ, శ్రీ చైతన్య ఐఐటి క్యాంపస్ ఉమెన్స్ కాలేజ్ లో సైబర్ క్రైమ్ పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, లోన్ ఫ్రాడ్స్, డేటింగ్ యాప్ మోసాలు, ట్రేడింగ్ అండ్ జాబ్ అడ్వర్టైజ్‌మెంట్ ఫ్రాడ్స్, రెంటల్ ఫ్రాడ్స్, మ్యాట్రిమోనీ మరియు ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఫ్రాడ్స్, డిజిటల్ ఫిషింగ్ మోసాలు మొదలైన వాటిపై ప్రత్యేక అవగాహన కల్పించారు. గురువారం మాదాపూర్ పోలీసు డివిజన్ పరిధిలో నిర్వహించిన ఆరు సమావేశాల్లో దాదాపు రెండు మంది యువకులు, వృద్ధులు, విద్యార్థులు, సాధారణ పౌరులు, ఐటి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మాదాపూర్ ఎస్ హెచ్ఓ కృష్ణమోహన్, డీఐ విజయ్, అలాగే మాదాపూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో పోలీసు అధికారులు ప్రజలకు "ఏ రకమైన సైబర్ మోసాలకు గురికాకుండా ఉండేందుకు ఆన్‌లైన్‌లో వచ్చే సందేశాలు, లింకులు లేదా ఆఫర్లను తప్పనిసరిగా రెండుసార్లు నిర్ధారించుకొని మాత్రమే స్పందించాలని కోరారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే 1930 నంబర్‌కి లేదా %షఎఎవతీషతీఱఎవ.స్త్రశీజ.ఱఅ% వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.



# ఈ కాయల గురించి మీకు తెలుసా..?

## ఎక్కడ కనిపించినా విడిచిపెట్టకుండా తెచ్చి తినండి.. ఎందుకంటే..?



టొమాటోలను మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. ఏ కూర అయినా సరే టొమాటోలు లేనిదే పూర్తి కాదు. టొమాటోలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతుంటారు. అయితే టొమాటోల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో రామ ములక్కాయలు కూడా ఒకటి. ఇవి టొమాటోల మాదిరిగానే ఉంటాయి. కానీ పరిమాణంలో చాలా చిన్నగా ఉంటాయి. ఇవి కూడా టొమాటోల జాతికి చెందినవే. రామ ములక్కాయలు మనకు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభిస్తుంది. సూపర్ మార్కెట్లు లేదా రైతు బజార్‌లలోనూ కొన్ని చోట్ల ఈ కాయలను విక్రయిస్తుంటారు. అయితే టొమాటోలలాగే రామ ములక్కాయలు కూడా మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిని కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కళ్ల ఆరోగ్యానికి..: రామ ములక్కాయలను తినడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా ఈ కాయల్లో లైకోపీన్ అధికంగా ఉంటుంది. అందువల్లే ఈ కాయలు ఎరుపు రంగులో ఉంటాయి. లైకోపీన్ చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే బీటా కెరోటీన్ మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. లుటీన్ అనే మరో యాంటీ ఆక్సిడెంట్ కూడా ఈ కాయల్లో అధికంగానే ఉంటుంది. విటమిన్ ఎ, లుటీన్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. రామ ములక్కాయల్లో ఉండే నారింజైన్, నారింజెనిన్ అనే సమ్మేళనాలు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. ఇవి కళ్ల వాపులను తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్‌ను అధిక మొత్తంలో పొందాలంటే ఈ కాయలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. పచ్చి వాటికన్నా ఉడకబెట్టిన కాయల్లోనే మనకు లైకోపీన్ అధిక మొత్తంలో లభిస్తుంది. లైకోపీన్ వల్ల గుండె కండరాల వాపులు రాకుండా అడ్డుకోవచ్చు. రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా నివారించవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

ఈ కాయల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. రామ ములక్కాయల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ కొవ్వు మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మొండి కొవ్వు సైతం కరిగిపోతుంది. ఫలితంగా అధిక బరువు సులభంగా తగ్గుతారు.

ఎముకల ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్ క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్ క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లైకోపీన్ వల్ల మహిళల్లో ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా మారుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు ఈ కాయలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. చర్మం లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు ఈ కాయలను మెత్తని పేస్ట్‌లా చేసి ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఫేస్ ప్యాక్ చేసుకుంటే అందులో కాస్త తేనె కలపాలి. అదే జుట్టుకు వాడితే ఆ పేస్ట్‌లో కాస్త పెరుగు కలిపి వాడాలి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చుండ్రు, జుట్టు రాలడం తగ్గుతాయి. ఇలా రామ ములక్కాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# దోమలను ఇలా తరిమేయండి..



ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువవుతోంది. తరచూ దోమలు కుడితే అనేక ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది. దీంతో చాలా మంది దోమల నివారణ కోసం రకరకాల మస్కిటో రిపెల్లెంట్లు, కాయిల్స్ వంటివి వాడుతుంటారు. ఇలాంటి కెమికల్ ఆధారిత నివారణలతో లేనిపోని అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టే. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే ఈ దోమల బెడద నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. ఇలాంటి సహజ సిద్ధ చిట్కాలు పాటించటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని నిపుణులు చెబుతున్నారు.

దోమల నివారణ కోసం ఉపయోగించే మస్కిటో రిపెల్లెంట్‌లను శరీరానికి డైరెక్ట్‌గా అప్లై చేసుకోకూడదు. కొనే ముందు బాగా రీసెర్చ్ చేయాలి. ఉదయం-సాయంత్రం వేళ లాంగ్ స్లీవ్స్, షర్టులు, ప్యాంటులు, సాక్స్‌లు వేసుకోవటం ఉత్తమం. అలాగే, మస్కిటో నెట్‌లు కొనుక్కుని బెడ్ రూమ్‌లో పెట్టుకోవాలి.సిట్రోనెల్ల, లావెండర్, మారిగోల్డ్ వంటి మస్కిటో రెపెల్లెంట్ మొక్కలను ఇంట్లో ఏర్పాటు చేసుకోవటం వల్ల కూడా ఫలితం వుంటుంది. దాంతో పాటుగా ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి మడుగు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. దోమల బెడద ఎక్కువగా ఉన్న చోట ఫ్యాన్లు పెట్టుకోవాలి.దోమలు కొన్ని రకాల సువాసనలకు దూరంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి వాటిల్లో తులసి, వెల్లుల్లి, వేప నూనె, లవంగాలు, నిమ్మకాయ, ఉల్లిపాయ, ఆపిల్ సిడార్ వెనిగర్, యూకలిప్టస్ ఆయిల్, లావెండర్, పుదీనా వంటి సువాసనలకు దూరంగా పారిపోతాయి. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే మూలల్లో తరిగిన ఉల్లిపాయలను ఉంచటం వల్ల ఆ ఘాటైన వాసనకు దోమలు, ఈగలు ఆ దరిదాపుల్లో కనిపించవు.

# ఈ అలవాటును తప్పించండి..



చిన్నపిల్లల్లో చాలామందికి బొటనవేలు చప్పరించే అలవాటు ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి కొందరు పెద్ద పిల్లల వరకు ఈ అలవాటు ఉంటుంది. అయితే ఈ అలవాటును లైట్ తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు వల్ల పిల్లలకు ఆరోగ్య పరంగా చాలా సమస్యలు వస్తాయి. పిల్లలు సాధారణంగా ఈ అలవాటును రెండు ఏళ్ల వయసులో మానేస్తారు. కానీ, ఈ వయసు దాటిన తర్వాత కూడా బొటనవేలు చప్పరించే అలవాటు మానకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

బొటనవేలు పీల్చడం వల్ల ముందు దంతాలు ముందుకు పొడుచుకుని రావడం, దవడ నిర్మాణం తప్పు దోవ పడుతుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆర్థోడాంటిక్ చికిత్స అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నోటి చుట్టూ ఉన్న చర్మం నిరంతరం తడిగా ఉండటం వల్ల చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయి. పిల్లల నాలుక, నోటి కండరాల అభివృద్ధికి ఇది అడ్డుగా నిలిచే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా పదాలను సరిగా పలకలేకపోవడం, మాట్లాడటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. చిన్న పిల్లల చేతులు చాలా మురికిగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పిల్లలు వేళ్లు నోట్లో పెట్టుకున్నప్పుడు చేతులపై ఉండే బ్యాక్టీరియా లేదా క్రిములు నోట్లోకి ప్రవేశిస్తాయి. దీని కారణంగా బిడ్డకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా ఇతర జీర్ణ సమస్యలు రావచ్చు. ఇది మాత్రమే కాదు, తరచుగా నోటి పూతలు లేదా గొంతు నొప్పి కూడా ఈ అలవాటు ఫలితంగా రావచ్చు.

పిల్లలు ఈ బొటనవేలు నోట్లో పెట్టుకోవడం వల్ల బలహీనపడటంతో పాటు.. దీర్ఘకాలంగా ఈ అలవాటు కొనసాగితే చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి ఇన్ఫెక్షన్ కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే దీన్ని నియంత్రించడానికి పిల్లలను గట్టిగా బెదిరించడం తగదు. ప్రేమగా వారి అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించాలి. దగ్గర కూర్చోబెట్టుకుని ఈ అలవాటు వల్ల వచ్చే సమస్యలు వివరించాలి. బొమ్మలు, పుస్తకాలతో దృష్టి మళ్లించాలి. చేదు రసాయనాలను వాడటం, చేతి తొడుగులు తొడిగించడం కూడా ఒక మార్గం.

వేపాకు రసం బొటనవేలుకు ఒక పొరలా రాయాలి. దీంతో చేదు కారణంగా ఈ అలవాటును త్వరగా మానేస్తారు. ఈ అలవాటు మానేస్తే ఏదో ఒక గిఫ్ట్ లేదా ఆటబొమ్మ కొనిపెడతాం అని ఆశ చూపించినా ఫలితం ఉండొచ్చు.

కొంత మంది పిల్లలు కొన్ని సమయాల్లో మాత్రమే వేళ్లు చప్పరిస్తారు. నిద్రపోయే ముందు, ఏదైనా ఒత్తిడి, టెన్షన్‌లో ఉన్నప్పుడు ఇలా చేస్తుంటారు. ఆ సమయాన్ని గమనించి..

వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు అంటున్నారు. బిడ్డ ఆరోగ్య భద్రత కోసం ఈ అలవాటు తీవ్రమయ్యే లోపు చర్యలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమతో, సహనంతో తీసుకున్న నిర్ణయాలు వారికి ఆరోగ్యంగా ఎదగడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

# చేతులు కడుగుదాం ఇలా



చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ఇన్ఫెక్షన్లు, రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. అయితే, దీని ప్రయోజనం అలా ఉంచితే చేతుల పరిశుభ్రత గురించి ఎన్నో అపోహలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకుందాం.

గ్లవ్స్ తొడుక్కుంటే: ఎక్కువసేపు గ్లవ్స్ తొడుక్కోవడం వల్ల సురక్షితంగా ఉంటామని చాలామంది భ్రమలో ఉంటారు. నిజానికి గ్లవ్స్ తొడుక్కొని వస్తువులు ఇతరులకు ఇవ్వడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. వండుతున్నప్పుడు, ఏవైనా వస్తువులు పట్టుకొన్నప్పుడు గ్లవ్స్ వాడుతుంటారు. అయితే, గ్లవ్స్ విడిచిపెట్టిన తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకోవాల్సిందే. అంతేకాదు గ్లవ్స్‌లో కూడా దుమ్ము, బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఇవి ఇతరులకు వ్యాపించవచ్చు. కాబట్టి, గ్లవ్స్ ధరించడం కంటే సబ్బుతో చేతులు కడుక్కోవడం మంచిది.

వేడినీళ్లు- చల్లనీళ్లు: హ్యాండ్ వాష్ పనితీరును నీటి ఉష్ణోగ్రత ఏమాత్రం మార్చదు. సూక్ష్మక్రిములు సబ్బు ప్రభావంతో చనిపోతాయి. నీళ్లు అవి వేడివైనా, చల్లటివైనా సబ్బు వదిలిపోవడానికే అని గుర్తుంచుకోవాలి. చేతులు కడుక్కునే విషయంలో చల్లటి నీళ్ల కంటే వేడి నీళ్లు ప్రయోజనకరమని శాస్త్రీయమైన ఆధారాలైతే లేవు.

శానిటైజేషన్-హ్యాండ్ వాష్: హ్యాండ్ వాష్ (సబ్బు) స్థానాన్ని శానిటైజర్ భర్తీ చేయదు. సబ్బుతో చేతులు కడుక్కోవడంతో వచ్చే ఫలితం శానిటైజర్ ద్వారా ఒనగూరదు. అన్ని సూక్ష్మక్రిములతో పోరాటానికి సబ్బుతో చేతులు కడుక్కోవడం సమర్థంగా పనిచేస్తుంది. శానిటైజ్ చేసుకోవడం దీనికి ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి, చేతులను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిముల నుంచి తగిన రక్షణ లభిస్తుంది.

పద్ధతి అవసరం లేదా: చేతులను సరైన పద్ధతిలోనే కడుక్కోవాలి. అరచేతులు, వెనకభాగం, వేళ్ల మధ్య, బొటనవేలు, గోళ్ల భాగం, మణికట్టు ఇలా అన్ని భాగాలను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఆ తర్వాత శుభ్రమైన తువాలుతో తుడుచుకోవాలి. సరైన విధానం వైద్యుడి ద్వారా తెలుసుకొని ఆచరించడం మేలు.

వాష్‌రూం తర్వాత వంటకుముందు: వాష్‌రూంకు వెళ్లివచ్చిన తర్వాత, వంటకు ముందు చేతులు కడుక్కోవాలని సాధారణంగా అనుకుంటారు. అయితే ఇది పరిసరాల్లో మనం ముట్టుకునే వస్తువులను బట్టి ఆధారపడి ఉంటుంది. రైళ్లు, బస్సులు, బాగా జనం ఉన్న ప్రదేశాలు, పెంపుడు జంతువులను తాకినప్పుడు, తలుపు హ్యాండిల్స్, ఫర్నిచర్, స్విచ్చులు, లిఫ్ట్ బటన్లు ఇలా ఎక్కువమంది వాడే వస్తువులను పట్టుకొన్నప్పుడు, మీ ముఖం, కండ్లు, ముక్కు తాకిన సందర్భాల్లో, గ్లవ్స్ ధరించడానికి ముందు ఆ తర్వాత కూడా చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిందే.




## మంథని నుండి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

**మంథని,తెలంగాణ దిశ :** తమిళనాడు లోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు మంథని డిపో నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపించనున్నట్లు మంథని డిపో మేనేజర్ వి. శ్రావణ్ కుమార్ తెలిపారు. వచ్చేనెల 3న సాయంత్రం మంథని బస్టాండ్ నుంచి బయలుదేరి కరీంనగర్, హైదరా బాద్ మీదుగా కాణిపాకం మరియు గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం 4వ తేదీన రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నా రు అరుణాచలం నుండి బయలుదేరి 6వ తేదీన ఉదయం శ్రీ అలంపూర్ జోగులాంబ అమ్మవారి దర్శనం అనంతరం బయలుదేరి కరీంనగర్ మీదుగా మంథని చేరుకుంటుందన్నారు. చార్జి ఒక్కరికి ఫుల్ టికెట్రూ.5040, హాఫ్ టికెట్ రూ.3790 ఉంటుందని తెలిపినారు. టికెట్ బుకింగ్ కొరకు మంథని డిపో నందు గాని ఈ 9959225923 9948671514 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కలువల సామెల్

**మంథని,తెలంగాణ దిశ :** మంథని మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (ఎంఎం యూపీఎఫ్) అధ్యక్షులుగా కలువల సామెల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంథని మండలం సిరిపురం గ్రామంలోని సెనగోగు ప్రార్థన మందిరంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంథని డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కాంపెల్లి దాస్, జాన్ పాల్ ల నేతృత్వంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రధాన కార్యదర్శిగా సుందిళ్ల అబ్రహం, ఉపాధ్యక్షులుగా ఆరుమల్ల ఎలీషా, సహాయ కార్యదర్శిగా అక్కపాక జోసెఫ్, కోశాధికారిగా మంథని మార్కు, కార్యనిర్వాహక సభ్యులుగా దూడ మహేష్, నిట్టూరి సత్కీర్తి, బడికెల సాత్విక్, కన్నూరి కృపావరం, వడ్ల డేవిడ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



# పతాకస్థాయికి చేరిన ప్రచారం




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ప్రచారం ఊపందుకుంది. మరో 20 రోజుల పాటు ఎన్నికల ప్రచారం జరగనుంది. నవంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఉపఎన్నిక ప్రచార ఘట్టం ముగియనుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఈ ఉపఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పార్టీ కార్యకర్తలు, నేతలు తమ పార్టీ గెలుపుకు శక్తివంచన లేకుండా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కృషి చేస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు అధికార కాంగ్రెస్ గెలుపుకు సీఎం రేవంత్ రెడ్డి, సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఎప్పుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. వీరిద్దరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారా, లేదా అన్న చర్చ సాగుతోంది.జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ప్రచార పర్వం వేడెక్కింది. ప్రస్తుతం ఈ ఉపఎన్నిక అటు అధికార కాంగ్రెస్‌కు, ఇటు సిట్టింగ్ స్థానం కాపాడుకొని తన బలాన్ని రుజువు చేసుకునేందుకు బీఆర్ఎస్‌కు కీలకం. అయితే, ఇప్పటి వరకు అటు సీఎం రేవంత్ రెడ్డి కానీ, ఇటు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కానీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. అయితే, మరో 20 రోజుల పాటు ఈ ఎన్నికల ప్రచారం సాగనుంది. ఇప్పటికే సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ ఈ ఎన్నికల గెలుపు వ్యూహాలపై పలు దఫాలుగా పార్టీ ముఖ్యులతో సమీక్షలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అటు కాంగ్రెస్ నుండి మంత్రులు రంగంలోకి దిగి ప్రచారంలో తమదైన శైలిలో ముందుకు సాగుతుంటే, ఇటు బీఆర్ఎస్ నుండి మాజీ మంత్రులు ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే, ఇప్పటి దాకా తాజా, మాజీ సీఎంల ప్రచార షెడ్యూల్‌పై మాత్రం అటు గాంధీ భవన్ వర్గాలు, ఇటు తెలంగాణ భవన్ వర్గాలు నోరు విప్పడం లేదు.ఇప్పటి దాకా అన్ని పార్టీలు తమ పార్టీ అభ్యర్థుల ఎంపికపై ప్రధానంగా దృష్టి పెట్టాయి. బీఆర్ఎస్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత అభ్యర్థిగా ఉన్నారు. ఇక కాంగ్రెస్ నుండి నవీన్ యాదవ్, బీజేపీ నుండి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. శాసన సభ షెడ్యూల్ విడుదల నుండి నేటి వరకు అభ్యర్థి ఎంపిక, ప్రచార వ్యూహాలపై మూడు పార్టీలు దృష్టి పెట్టాయి. అభ్యర్థులు ఖరారు కావడంతో పార్టీ నేతలంతా జూబ్లీ హిల్స్ నియోజకవర్గ బాట పట్టారు.కాంగ్రెస్ నుండి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు ప్రచారంలో పాల్గొన్నారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లు ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. అయితే, ఇప్పటి దాకా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచార షెడ్యూల్ మాత్రం ఖరారు కాలేదు. ఎన్నికల ప్రచారం మరో మూడు వారాలు సాగనుండడంతో, చివరి వారం రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉందని హస్తం ముఖ్య నేతలు చెబుతున్నారు.మరోవైపు, గత శాసన సభ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్‌కు అనుకున్న ఫలితాలు రాని పరిస్థితి ఉంది. అయినా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ ఉపఎన్నికలోనూ అదే ఫలితం రావచ్చని కొందరు నేతలు చెపుతుంటే, హైడ్రామా కారణంగా నగర ఓటర్లలో కాంగ్రెస్ పట్ల కొంత విముఖత ఉందని, ఇది ప్రభావం ఈ ఉపఎన్నిక ఫలితంపై చూపవచ్చని మరి కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ఒకటి రెండు ప్రచార సభల్లో పాల్గొనవచ్చు లేదా పాల్గొనకపోవచ్చని చెబుతున్నారు. సీఎం ప్రచారం చేసినా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీ గెలవకపోతే అది రాజకీయంగా ఓ మచ్చగా మిగలవచ్చని, అందుకే ఈ ఉపఎన్నిక ప్రచారానికి దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు. అయితే, ఇప్పటి వరకు అలాంటి సంకేతాలు ఏవీ సీఎం నుండి రాలేదన్నది ఆయన సన్నిహితుల మాట.ఇప్పటి దాకా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో అటు కేటీఆర్, ఇటు హరీశ్ రావులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. వారే మాజీ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. అయితే, ఈ ఉపఎన్నికల ప్రచారంలో కేసీఆర్ అసలు పాల్గొంటారా, లేదా అన్న చర్చ సాగుతోంది. సాధారణ ఎన్నికల్లో సైతం కేసీఆర్ చివరి నిమిషంలోనే ప్రచారంలో పాల్గొనడం జరుగుతూ ఉండేది. అయితే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికలో సైతం కేసీఆర్ ప్రచారంలో పాల్గొనలేదు. ఆ ఎన్నికల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నేత పద్మారావ్ గౌడ్‌లే ప్రచారం నిర్వహించారు. ఆ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేశ్ విజయం సాధించారు. అయితే, ఇటీవలి పార్టీలో జరిగిన పరిణామాలు, అటు ప్రభుత్వ విచారణలు, ఆరోపణల నేపథ్యంలో కేసీఆర్ ఉపఎన్నిక ప్రచార బరిలో దిగుతారా, లేదా అన్న చర్చ సాగుతోంది. అయితే, పార్టీ ముఖ్యనేతలు మాత్రం ఒకటి రెండు ప్రచార సభలు లేదా రోడ్ షోలు నిర్వహించాలని పార్టీ అధినేతను కోరినట్లు సమాచారం. ఇప్పటి దాకా ఈ విషయంలో కేసీఆర్ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.రాష్ట్రంలో ప్రత్యామ్నాయ బలంగా తయారవడానికి బీజేపీ ఎన్నో ఏళ్ల నుండి కృషి చేస్తోంది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో తన బలాన్ని పెంచుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం. అందుకు వేదికగా జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో తన సత్తా చాటేందుకు కమలం పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఆ పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత రాంచందర్ రావుకు ఇది తొలి పరీక్ష. ఈ ఉపఎన్నికలో సత్తా చాటాలని ఆయన భావిస్తున్నారు. అంతే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జూబ్లీ హిల్స్ ఉండడంతో అక్కడి నుండి ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి సైతం ఈ స్థానంలో కమలం పార్టీ వికసించాలని కోరుకుంటున్నారు. గతంలో ఇక్కడి నుండే పోటీ చేసి ఓడిపోయిన దీపక్ రెడ్డికి టికెట్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపు బాట పట్టాలని, తద్వారా రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయం అని చాటేందుకు కమలం నేతలు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే కిషన్ రెడ్డి, రాంచందర్ రావులు ప్రచార బాట పట్టారు. మరి కొద్ది రోజుల్లో మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.బీజేపీ నుండి ముఖ్యనేతలు ఇప్పటికే ప్రచార బరిలో దిగగా, అధికార కాంగ్రెస్ పార్టీ నుండి సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ప్రచార తీరుతెన్నులపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. అటు కాంగ్రెస్ నుండి సీఎం రేవంత్, కిషన్ రెడ్డి, బండిసంజయ్ వంటి వారు ప్రచారంలోకి దిగితే మాత్రం ఈ పోటీ రసవత్తరంగా మారే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# పీక్స్ కు చేరిన పొలిటికల్ హీట్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనంతగా పొలిటికల్ హీట్ ను పీక్స్ కు తీసుకె ళ్లాయి. సిట్టింగ్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మృతి తో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే. సాధారణంగా సిట్టింగ్ సీటుకు అనివార్య కారణాల వల్ల మధ్యలో ఎన్నికలొస్తే,సానుభూతి పైనేసిట్టింగ్ ఎమ్మెల్యే కు చెందిన పార్టీ ఆశలు పెట్టుకుంటుంది. అందులోనూ మాగంటి గోపీనాథ్ భార్య సునీతకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించడంతో సానుభూతి ఓటింగ్ పై ఇంకాస్త ఎక్కువ ఆశలే పెట్టుకుంది బీఆర్ ఎస్ పార్టీ. దీనికితోడు జూబ్లీహిల్స్ బరిలో నిలిచిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత ఎన్నికల ప్రచారం కొనసాగుతున్న తీరు, కాస్త కొత్తగా ఉంది.కేటీఆర్ వంటికీలక నేతలు పాల్గొన్న బీఆర్ఎస్ ఎన్నికలసభల్లో ఎమ్మెల్యే అభ్యర్ది సునీత భావోద్వేగం ఆపుకోలేక, భర్తను అభిమానించే కార్యకర్తలను చూసి తీవ్ర దుఖంతో కన్నీళ్లు పెట్టుకుంటున్న తీరు చూసి సొంత పార్టీ నేతలే షాకవుతున్నారు. కనీసం వేదికపై నోటి నుండి మాటలు రాలేనంతగా ఆమె విలపిస్తుంటే, మాగంటి గోపీనాథ్ అభిమానులే కాదు, చూస్తున్న ఓటర్లను సైతం కలచివేస్తోంది. భర్త, పిల్లలు తప్ప ఇన్నాళ్ల రాజకీయాలను కన్నెత్తి చూడని సునీత ,ఇప్పుడు ఏకంగా హోరాహోరీ పోరులో ఎమ్మెల్యేగా గెలుపు కోసం అధికార పార్టీతోనే పోటీపడుతున్నారు. కన్నీళ్లే ప్రచారాస్త్రంగా మాగంటి సునీత ప్రచారం కొనసాగుతున్న తీరుపై కాంగ్రెస్ నేతలు విమర్శలతో విరుచుకుపడు తుంటే, మరోవైపు బీఆర్ ఎస్ నేతలు,సోషల్ మీడియాలో సైతం సునీతకు గట్టిగానే మద్దతు లభిస్తోంది. గతంలో జూబ్లీహిల్స్ లో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి, నమ్మిన క్యాడర్, నమ్ముకున్న నియోజకవర్గ ఓటర్లతోపాటు భార్య సునీతపై సానుభూతి ఖచ్చితంగా వర్కవుట్ అవుతుందనే కొండంత ఆశతో ఉన్నారు బీఆర్ ఎస్ నేతలు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్దిగా పోటీపడుతన్న నవీన్ కుమార్ యాదవ్ సైతం రాజకీయాల్లో తానేం తక్కువ కాదంటూ మొదటి నుండి జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్నారు. తీవ్ర పోటీలో సైతంసీటు దక్కించుకున్న నవీన్, సీటు ప్రకటన క్షణం నుండి నామినేషన్ వేసే వరకూ పార్టీలో సీనియర్లు, కుల పెద్దలు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన బీసీ నేతలు ఇలా ప్రతీ ఒక్కరినీ స్వయంగా వెళ్లి కలసి ,వారి మద్దతు తీసుకున్నారు.తనకు సీటు కేటాయించకుండా అడ్డుపడ్డ అంజన్ కుమార్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్ లను సైతం తానే స్వయంగా వెళ్లి కలసి, వారి మెప్పుపొందరాంటే పరిస్దితి అర్దం చేసుకోవచ్చు.ప్రతిపక్ష బీఆర్ ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను కూడా నవీన్ కలిసారంటే పరిస్దితి అర్దం చేసుకోవచ్చు. ఇలా పార్టీలతో సంబంధం లేకుండా మనోడు అనిపించుకునేలా నవీన్ వ్యూహాత్మకంగా దూసుకుపోతున్నారు. గతంలో రెండు సార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం, ముఖ్యంగా ఎంఐఎం మద్దతు దండిగా ఉన్న నేపథ్యంలో గెలుపు పై గట్టి ధీమాతో ఉన్నారు నవీన్ కుమార్ యాదవ్. నామినేషన్ ముందు వరకూ శత్రువులను సైతం దగ్గర చేసుకునే ప్రయత్నం చేయడం, నామినేషన్ తరువాత ఓటర్లను ఆకర్షించేలా ప్రచారం ముమ్మరం చేయడం ద్వారా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి,సానుభూతి, బీఆర్ ఎస్ బలమైన క్యాడర్ ను తట్టుకుని నవిన్ విజయం సాధిస్తారా లేదా అనేది వేచిచూడాలి.జూబ్లీహిల్స్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్ది లంకల దీపక్ రెడ్డి ఎన్నికల ప్రచారం తీరు కాంగ్రెస్ , బీఆర్ ఎస్ కు దీటుగా కొనసాగుతో?ంది. గత ప్రభుత్వాలు జూబ్లీహిల్స్ ను ఏమాత్రం అభివృద్ధి చేయలేదని,బిజెపి అధికారంలోకి వస్తే ,మేం చేయబోయే అభివృద్ధి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు దీపక్ రెడ్డి. గత ఎన్నికల సమయంలో మేము మూడవ స్దానంలో ఉన్నాం. ఇప్పుడు రెండ స్దానికి చేరుకున్నాం. నెక్ట్స్ ఈ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయమే అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎఐఎం ,కాంగ్రెస్ కలిసినా భయంలేదు. మాకు పదిశాతం ఓట్లు పెరిగితే చాలు గెలిచితీరుతామంటున్నారు. దేశంలో మోదీ అభివృద్ది , కిషన్ రెడ్డి నాయకత్వంతో గెలపు పక్కా అంటూ లెక్కలు చెప్పేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రచారం పీక్స్ కు తీసుకెళుతున్నారు లంకల దీపక్ రెడ్డి. అధికార కాంగ్రెస్ ను లైట్ తీసుకున్న బీజేపి అభ్యర్ది గెలుపు లెక్కలు పోలింగ్ పరీక్షలో ఫస్ట ర్యాంక్ తెస్తాయో , లేదో వేచిచూడాలి.

### సీఎంను అందుకే కలిశాను..
## తేల్చి చెప్పిన ఎమ్మెల్యే పోచారం



**బాన్సువాడ,తెలంగాణ దిశ :** బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డితన నివాసంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా కుటుంబం నా స్వార్థం కోసం సీఎం. నీ కలవలేదని బాన్సువాడ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసమే సీఎంను కలిశాను అన్నారు. సీఎం దగ్గర నా స్వార్థం కోసం పోతే నేను రాజీనామాకు సిద్ధమే అన్నారు. నేను స్పీకర్‌గా ఉన్నపుడు అభివృద్ధి కోసం మాజి సీఎం కె.సి.ఆర్. అడిగినన్ని నిధులు మంజూరు చేశారు అని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే నిధులు అవసరం అందుకే సీఎం రేవంత్ రెడ్డి ని అభివృద్ధి కొరకు నిధులు కావాలని కలిశానని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, అబ్దుల్ వహాబ్, పిట్ల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## షిర్డీ వెళ్లాలనుకునే వారికి బంపర్ ఆఫర్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ నుంచి షిర్డీ క్షేత్రానికి రోజూ వేలాది మంది సాయిబాబా భక్తులు వెళ్తుంటారు. సాయిబాబా దర్శనం కోసం వెళ్ళే భక్తులు బస్సులు, రైళ్లు, టూరిజం బస్సులు వంటి వాటిని ఎంచుకుంటారు. లేదు అంటూ భావిస్తారు.. అటువంటి వారి కోసం తాజాగా బంపర్ ఆఫర్ ప్రకటించింది. తక్కువ ధరకే సాయి సన్నిధి ఎక్స్ హైదరబాద్ అనే పేరుతో ప్రత్యేక షిర్డీ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెలలో ప్రారంభం కానున్న ఈ టూర్ 2 రాత్రులు, 3 రోజులపాటు సాగనుంది. ప్రతి అందుబాటులో ఉండనున్నది. ఈ టూర్ ప్యాకేజీకి లో టికెట్స్ బుక్ చేసుకోవాలనుకునేవారు సూచించిన వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. ఈ నెల అక్టోబర్ 29 తేదిన కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి (రైలు నెంబర్ 17064) సాయంత్రం 6,40 గంటలకు జర్నీ స్టార్ అవుతుంది. సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ వంటి స్టేషన్ల మీదుగా ఈ ప్రయాణం సాగుతుంది. రాత్రి అంతా ప్రయాణం చేసి మహారాష్ట్రలోని నాగర్ సొల్ రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. ఇక్కడ అనుంచి షిర్డీకి ప్రత్యేక వాహనం ద్వారా చేరుకుంటారు. రెండో రేజు ఉదయం శిర్డీలోని హొటల్‌లో చెక్-ఇన్ అవ్వాలి. అల్పాహారం తిని షిర్డీ సాయిబాబా దర్శనం కోసం ఆలయానికి చేరుకోవాలి. సాయంత్రం 5 గంటలకు హొటల్ చెక్ అవుట్ అయ్యి.. రాత్రి 7.30 గంటల నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకోవాలి. రెండో రోజు రాత్రంతా ప్రయాణం చేసి మూడో రోజు ఉదయం 9:45కి కాచిగూడకు చేరుకోవాలి.

## నిధుల కొరతను అధిగమించి పనులు పూర్తి చేయాలి

**సంగారెడ్డి,తెలంగాణ దిశ :**సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్, జూనియర్ కాలేజీ లో పెండింగ్‌లో ఉన్న పనులను టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మల, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పరిశీలించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరు నెలలక్రితమే హై స్కూల్, జూనియర్ కాలేజీలను, వేరు చేసేందుకు ప్రహరీ గోడ నిర్మించాలని ప్రతిపాదించినప్పటికీ, బడ్జెట్ లేకపోవడంతో పనులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ఈ గోడ, గేట్ నిర్మాణానికి సుమారు రూ.50 లక్షలు అవసరమవుతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు టీజీఐఐసి చైర్‌పర్సన్ లెటర్‌హెడ్‌పై వినతిపత్రం పంపాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. అదనంగా, జూనియర్ కాలేజీ రెండో అంతస్తులో అదనపు తరగతి గదులు, సేఫ్టీ వాల్‌లు, సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయాలన్న ప్రిన్సిపాల్ అభ్యర్థనపై మరో రూ.50 లక్షల నిధులు కోరాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రౌండ్‌లో వర్షాకాలంలో నీరు నిలుస్తుందని జగ్గారెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆ సమస్య పరిష్కారానికి గ్రావెల్ కోసం మరో రూ.20 లక్షల నిధులు వినియోగించాలని సూచించారు. అదేవిధంగా, బాయ్స్ హై స్కూల్‌లో "మన ఊరు మన బడి" పథకంలో నిర్మించిన కొత్త భవనానికి పెయింటింగ్ కోసం రూ.10 లక్షల నిధులు కేటాయించాలని అధికారులను కోరారు. ఈ విధంగా హై స్కూల్, జూనియర్ కాలేజీల పెండింగ్ పనుల కోసం రూ.1 కోటి 30 లక్షల రూపాయల నిధులు అవసరమని నిర్ధారించి, కలెక్టర్‌కు వినతిపత్రం పంపాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న నిరుపయోగ భవనాలను కూల్చివేసి, సంబంధిత ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు.

# 66వేల పెట్టుబడి.. 660 రూపాయిల ఆదాయం



ముంబై, : ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కోయకుండానే కన్నీళ్లు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడిలో పదో వంతు కూడా వారి చేతికి రావడం లేదు. కనీసం పంటను మార్కెట్‌కు తరలించిన ఖర్చులు కూడా రాకపోవడంతో.. అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం.. చేతికొచ్చిన ఆ మాత్రం పంటకు రేటు లేకపోవడంతో భారీ నష్టాలను చవిచూస్తున్నా రు. మరికొందరు రైతులు.. పంటను కోసి, వాటిని మార్కెట్‌కు తీసుకెళ్లినా ఆ ఖర్చులు కూడా రావడం లేదని.. పంటను కోయకుండా అలాగే పొలాల్లో వదిలేస్తున్నారు.మహారాష్ట్ర రైతు సుదామ్ ఇంగ్లే ఉల్లి సాగు కోసం రూ.66 వేల పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల కారణంగాపంట దెబ్బతినడంతో.. 7.5 క్వింటాళ్ల ఉల్లి పంట మాత్రమే వచ్చింది. ఆ ఉల్లి పంటను మార్కెట్‌కు తరలించగా.. రవాణా ఖర్చులు పోను ఆయనకు కేవలం రూ. 664 మాత్రమే మిగిలాయి. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో ఆవేదన చెందిన సుదామ్ ఇంగ్లే.. మిగిలిన పంటను అమ్మడం కంటే పొలానికి ఎరువుగా మార్చడమే మేలు అని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఎడతెరిపి లేని వర్షాలు, ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని.. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతుల ఆత్మహత్యలు పెరుగుతా యని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ దయనీయ పరిస్థితి మహారాష్ట్ర లోని ఉల్లి, టమోటా, సోయాబీన్ వంటి అనేక పంటలు సాగు చేసే రైతులందరిదీ అని ఈ వార్త తెలియజేస్తోంది. పంట కోసం ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు ఈసారి మిగిలింది కన్నీరేనని తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రాకపోగా.. కనీసం మార్కెట్‌కు పంటను తరలించిన రవాణా ఖర్చులూ దక్కని దయనీయ పరిస్థితి మహారాష్ట్ర రైతన్నలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.మహారాష్ట్ర పూణే సమీపంలోని పురందర్‌కు చెందిన రైతు సుదామ్ ఇంగ్లే.. తన పొలంలో ఉల్లి సాగు కోసం సుమారు రూ.66 వేలఖర్చు చేశారు. అయితే ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. అయినప్పటికీ.. కొంత భాగాన్ని కాపాడి దాన్ని బస్తాల్లో నింపి.. రూ.1,500 ఖర్చు చేసి పురందర్ మార్కెట్ యార్డుకు తరలించారు.అక్కడ 7.5 క్వింటాళ్ల ఉల్లిపాయలను విక్రయించగా.. రవాణా, లోడింగ్ ఖర్చులు (రూ. 1,065) పోను ఆయన చేతికి వచ్చింది కేవలం రూ. 664 మాత్రమే. అంటే రూ.66 వేలు ఖర్చు పెడితే కనీసం వెయ్యి రూపాయలు కూడా మిగలలేదు. ఆ రైతు అమ్మిన ఉల్లిపాయలు నష్టం ఆధారంగా కిలోకు రూ. 3, రూ. 2, రూ. 10 చొప్పున అమ్ముడుపోయాయని తెలుస్తోంది.తనకు జరిగిన నష్టాన్ని చూసి సుదామ్ ఇంగ్లే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ఎకరం భూమి నుంచి వచ్చిన పంట మాత్రమేనని.. తనకు మరో ఒకటిన్నర ఎకరాల్లో ఉల్లి పంట ఉందని పేర్కొన్నారు. దాన్ని మార్కెట్‌కు తీసుకెళ్లి మరింత నష్టపోవడం కంటే.. రోటవేటర్ వేసి పొలానికి ఎరువుగా మార్చేస్తానని చెప్పారు. అమ్మడం కంటే అదే లాభదాయకమని వాపోయారు. తన లాంటి పెద్ద రైతులపరిస్థితే ఇలా ఉంటే..అప్పులు చేసి సాగుచేస్తున్నచిన్న రైతులు ఎలా బతకాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించక పోతే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతాయని ఆయన హెచ్చరించారు. మహారాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలు.. పడిపోతున్న ధరలు అన్నదాతల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉల్లిపాయలు, టమోటాలు, బంగాళాదుంపల నుంచి దానిమ్మ, సీతాఫ లం, సోయాబీన్ వరకు దాదాపు ప్రతీ పంట పండించిన రైతుకు ఈ సీజన్‌లో ఇలాంటి పరిస్థితే ఎదురైందని చెబుతున్నారు. నాసిక్ ప్రాంతంలో ఏకంగా 80 శాతం ఉల్లిపాయ పంట వర్షాల కారణంగా దెబ్బతినగా.. కాపాడిన పంట కూడా నాణ్యత లేకపోవడం వల్ల అతి తక్కువ ధరలకు అమ్ముడవుతోంది. చేతిలో డబ్బు లేకపోవడంతో రైతులు కొనుగోలు శక్తిని కోల్పోయారు. దీంతో గ్రామీణ మార్కెట్లలో దీపావళి కళ పూర్తిగా కరువైంది. నగరాల్లో మాత్రమే దీపావళి వేడుకలు జరుగుతున్నాయని.. పల్లెల్లో దీపం కొనుక్కోవడానికి కూడా డబ్బు లేదని పేర్కొంటున్నారు.రైతులు ప్రభుత్వ విధానాలను కూడా తప్పుబట్టారు. 2023లో ఉల్లి ధరలు పెరిగినప్పుడు కేంద్రం ఎగుమతులను నిషేధించడం వల్ల ఇతర దేశాలు అంతర్జాతీయ మార్కెట్‌ను ఆక్రమించాయని, దీనివల్ల భారతదేశం తమ ఎగుమతి వాటాను కోల్పోయిందని ఆరోపించారు. ధరలు పెరిగినప్పుడు ఎగుమతిని నిషేధించిన ప్రభుత్వం.. మార్కెట్ ధరలు కుప్పకూలిన ప్పుడు గిట్టుబాటు ధర ఇచ్చి ఉల్లి పంటను కొనుగోలు చేయదా అని ప్రశ్నించారు. వ్యవసాయం అంటే కష్టాల జీవితమేనా అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

# నక్వీకి వార్నింగ్

ముంబై, : పాకిస్తాన్ దేశమే కాదు.. అక్కడి పాలకులు కూడా దుర్మార్గులే. ఇది అనేక సందర్భాల్లో నిరూపితమైంది. ఇప్పుడు కూడా నిరూపితం అవుతోంది. చివరికి క్రికెట్ జట్టును పర్యవేక్షించే వ్యక్తులు కూడా దుర్మార్గంగానే వ్యవహరిస్తున్నారు. భారత్ మీద విషాన్ని కక్కుతున్నారు. ప్లేయర్లు మాత్రమే కాదు.. బోర్డును పర్యవేక్షించేవారు కూడా ఇలా వ్యవహరించడం పట్ల యావత్ క్రికెట్ ప్రపంచం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.ఇటీవల ఆసియా కప్ జరిగింది. ఇందులో టీమిండియా ఫైనల్ మ్యాచ్లో పాకిస్తాన్ జట్టుపై అద్భుతమైన విజయం సాధించింది. ట్రోఫీ అందుకునే విషయంలో టీమిండియా నిరసన వ్యక్తం చేసింది. పహల్గాం దాడి, సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని టీమిండియా ఎసిసి చీఫ్, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడానికి ఆసక్తిని ప్రదర్శించలేదు. టీమిండియా ప్లేయర్ల నిరసన నేపథ్యంలో ఎసిసి చీఫ్ ఆసియా కప్, మెడల్స్ తన వెంట తీసుకొని పోయారు.నఖ్వీ వ్యవహరిస్తున్న తీరు పట్ల భారత క్రికెట్ మేనేజ్మెంట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆసియా కప్ ఫైనల్ జరిగిన రెండు రోజుల తర్వాత ఎసిసి ఎజిఎం సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు ఎసిసి చీఫ్ కు గట్టి హెచ్చరికలు పంపించింది. ట్రోఫీ సరైన విధానాల్లో పంపించాలని.. లేకపోతే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. కాదు అధికారిక ఈమెయిల్ ద్వారా కూడా సందేశం పంపించింది. అయితే ఇప్పటివరకు ఏసీసీ చీఫ్ నుంచి ఎటువంటి ప్రత్యుత్తరం రాలేదు. దీంతో ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలికి తెలియజేస్తామని ఇప్పటికే భారత క్రికెట్ యాజమాన్యం ప్రకటించింది. ట్రోఫీని తమ వద్దకు ఎలా రప్పించుకోవాలో తెలుసని.. ఎందుకు దశలవారీగా ముందుకు సాగుతామని భారత క్రికెట్ యాజమాన్య ప్రకటించింది.. అయితే ఎసిసి కార్యాలయంలో భారత జట్టుకు ట్రోఫీ అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని నఖ్వీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎసిసి చీఫ్ గా మాత్రమే కాకుండా, నఖ్వీ పాకిస్తాన్ మంత్రిగా కూడా ఉన్నారు. దీంతో అతని చేతుల మీదుగా ఎట్టి పరిస్థితుల్లో ట్రోఫీని తీసుకునే పరిస్థితి లేదని బీసీసీ స్పష్టం చేసింది. అయితే అంతర్జాతీయ మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం ఆసియా కప్ దుబాయ్ లోని ఏసీసీ కార్యాలయంలోనే ఉందని తెలుస్తోంది. అయితే ఆ ట్రోఫీని తన అనుమతి లేకుండా బయటికి తరలించకూడదని.. ఇతరులకు అప్పగించకూడదని నఖ్వీ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

# ఎంపీగానే రాఘవరెడ్డి పోటీ...

**ఒంగోలు,తెలంగాణ దిశ :** ఊహించిందే జరిగింది. ఒంగోలు ప్రజలకు అంతో క్లారిటీ ఉంది. ఆయన కూడా అదును చూసి ప్రకటన చేశారు. బర్త్ డే సందర్భంగా..సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చారు ఒంగోలు టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని అంటూనే..తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తారని తెలిపారు. చంద్రబాబు ఆదేశాల ప్రకారమే గత ఎన్నికల్లో తాను పోటీ చేశానని చెప్పుకొచ్చారు.మాగుంట కుటుంబ రాజకీయ వారసుడిగా రాఘవరెడ్డిని రంగంలోకి దింపాలని శ్రీనివాసులు రెడ్డి ఎప్పటి నుంచో ఆరాటపడుతున్నారు. వయస్సు మీద పడుతుండటంతో తన కుటుంబ వారసుడిని రంగంలోకి దింపేందుకు ఇదే కరెక్ట్ సమయమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లోనే టీడీపీ నుండి తన కుమారుడిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపేందుకు శతవిధాలా ప్రయత్నించారు ఎంపీ మాగుంట. మొన్నటి సారి ఎంపీగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గిద్దలూరు లేదా దర్శి అసెంబ్లీ నుంచి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. కానీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు రాఘవరెడ్డి ఆసక్తి చూపలేదట.టీడీపీ అధిష్టానం రాఘవరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా పరిగణలోకి తీసుకున్నా.. సర్వేల్లో మాగుంట శ్రీనివాసులురెడ్డికే ప్రజలు ఓటేశారని ఆయన వైపే మొగ్గు చూపారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రాఘవరెడ్డిపై ఆరోప ణలు..అరెస్టులు వంటి కీలక పరిణామాలతో తప్పని పరిస్థితుల్లో మాగుంటనే బరిలో దింపింది టీడీపీ అధిష్టానం. ఓవైపు వయోభా రం..మరోవైపు తన కుమారుడి పొలిటికల్ ఎంట్రీ కోసం ఆశపడు తున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి..తన తనయుడు రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. తాను రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నప్పుడే తన కుమారుడిని వారసుడిగా లైన్‌లోకి దింపి తమ కుటుంబ చరిష్మాను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉన్నారట మాగుంట. దీంతో జన్మదిన వేడుకల సందర్భంగా తన మనసులో మాటను మరోసారి బయటపెట్టారు ఎంపీ మాగుంట.రాఘవరెడ్డి ఇప్పటికే పొలిటికల్‌గా యాక్టీవ్‌గా ఉంటున్నారు. తన తండ్రి శ్రీనివాసులురెడ్డి రాజకీయ వ్యవహారాలతో పాటు వ్యాపారాల్లో చేదోడువాదోడుగా ఉంటూ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల టైమ్‌లో కూడా రాఘవరెడ్డి ప్రచారం చేశారు. మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒంగోలు పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల తర్వాత కూడా యాక్టీవ్‌గా ఉంటూ వస్తున్నారు రాఘవరెడ్డి. నియోజకవర్గాల వారీగా నేతలను కలుస్తూ..సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపుతున్నారు. అటు యువతతో..ఇటు సీనియర్ నేతలతో కోఆర్డినేట్ చేసుకుంటూ అందరికీ దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.ఫ్యామిలీకి 30 ఏళ్ల పొలిటికల్ ట్రాక్ రికార్డు ఉంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి తన సోదరుడు మాగుంట సుబ్బిరామిరెడ్డి మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. 1998, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఒంగోలు నుంచి ఎంపీగా విజయం సాధించారు.

2014 ఎన్నికలప్పుడు మాగుంట కాంగ్రెస్ పార్టీకి రిజైన్ చేసి టీడీపీలో చేరి 2014లో ఒంగోలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2015లో ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల .2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి గెలిచారు మాగుంట శ్రీనివాసులురెడ్డి. ఇక ఇప్పుడు తన ఫ్యామిలీ రాజకీయ వారసత్వాన్ని కంటిన్యూ చేసేందుకు కొడుకు రాఘవరెడ్డిని బరిలోకి దింపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మరి మాగంటి వారసుడిగా రాఘవరెడ్డి పొలిటిక్స్‌లో ఎంతవరకు రాణిస్తారో చూడాలి మరి.

# రైల్వే టిక్కెట్ రీ షెడ్యూల్ అవకాశం




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశంలో ప్రతిరోజూ కోట్లాది మంది ప్రజలు రైలులో ప్రయాణం చేస్తున్నారు. ఈ ప్రయాణికుల కోసం రైల్వే శాఖ వేలాది రైళ్లను నడుపుతోంది. తద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అయితే, కొన్నిసార్లు ప్రయాణం ఫిక్స్ చేసుకున్నాక అనుకోకుండా మీ జర్నీ ప్లాన్ మారుతుంది. అతి కష్టమ్మీద బుక్ చేసుకున్న టికెట్ రద్దు చేసుకుంటే మళ్లీ బుక్ చేసుకోవడం కష్టమే. అందుకే మీరు టిక్కెట్‌ను క్యాన్సిల్ చేసుకోవల సిన అవసరం లేదని రైల్వేశాఖ చెబుతోంది. టికెట్ క్యాన్సిల్ సమస్యను పరిష్కరించడానికి, భారత రైల్వేశాఖ ఇప్పుడు ఒక కొత్త నియమాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, మీ జర్నీ తేదీ మారితే, టికెట్‌ను క్యాన్సిల్ చేయవలసిన అవసరం లేదు. మీరు ఇదివరకు బుక్ చేసుకున్న టికెట్‌తో మరేదైనా తేదీలో ప్రయాణించ వచ్చు. అయితే రైల్వేశాఖ ఇందుకోసం కొన్ని షరతులు విధించింది. ఈ కొత్త నియమం ఎలా పని చేస్తుంది, ఎవరికి ప్రయోజనం చేకూరుస్తుందో ఇక్కడ తెలుసుకోండి. టికెట్ బుకింగ్ సిస్టమ్‌లో పెద్ద మార్పులు చేయడానికి భారతీయ రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఇప్పుడు ప్రయాణికులు టికెట్‌ను రద్దు చేయకుండా, వారి ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు. ఉదాహరణకు.. మీరు నవంబర్ 20న రైలు టికెట్ బుక్ చేసుకుంటే, జర్నీని నవంబర్ 22కి వాయిదా వేసుకోవాల్సి వస్తే.. అదే టికెట్‌ను రీషెడ్యూల్ చేయవచ్చు. ఈ సౌకర్యం ఎఖీఅఆ పోర్టల్ లేదా యాప్ ద్వారా బుక్ చేసుకున్న కన్ఫర్మ్ టిక్కెట్‌లకు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రైల్వే ప్రయాణికులు పాత టికెట్‌ను రద్దు చేసుకుని, కొత్త టికెట్‌ను బుక్ చేసుకుంటున్నారు. తద్వారా టికెట్ క్యాన్సిల్ ఛార్జీలు చెల్లించాలి. కొత్త రూల్ ద్వారా ఈ ఇబ్బంది ఉండదు. కొత్త తేదీలో రైలు ఛార్జీలు ఎక్కువగా ఉంటే, ప్రయాణికుడు పెరిగిన ఛార్జీల వ్యత్యాసాన్ని చెల్లించాలి. ఈ మార్పు ప్రయాణికులకు రైల్వే డిజిటల్ సేవలను మరింత సౌకర్యవంతంగా చేస్తుంది.ఈ కొత్త నియమం ప్రయాణికులకు టికెట్ రద్దు చేయకుండా, వినియోగించుకునేందుకు ఉపశమనం కలిగిస్తుంది. చాలాసార్లు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటారు. దీనివల్ల టికెట్‌ను రద్దు చేస్తే 25 శాతం నుండచి 50 శాతం వరకు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మరీ ఆలస్యమైతే ఎలాంటి రీఫండ్ కూడా ఉండదు. ఇకనుంచి రైల్వే ప్రయాణికులు తమ టికెట్‌ను రద్దు చేయకుండా ప్రయాణించాలని యోచిస్తోంది. అందుకు బదులుగా ట్రావెల్ డేట్ అప్‌డేట్ చేసుకుంటే సరిపోతుంది. రైల్వేశాఖ కొత్త రూల్ ద్వారా ప్యాసింజర్స్ సమయం, డబ్బు రెండు ఆదా అవుతాయి. కొత్త తేదీలో అదే సీటు మళ్లీ కన్ఫర్మ్ అవుతుందని కాదు. సీటు లభ్యత ఆధారంగా టికెట్ నెంబర్ మారుతుంది. నివేదికల ప్రకారం, రైలు మిస్ అయిన సందర్భంలో కూడా ప్రయాణికులకు పాక్షిక రీఫండ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా విడుదల కాలేదు.

# టీచర్లకు టెన్షన్..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత తప్పనిసరి చేసింది ఎన్‌సీటీఈ. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లగా అత్యున్నత న్యాయస్థానం కూడా నిర్ణీత గడువులోగా టెట్ అర్హత సాధించాలని స్పష్టం చేసింది. టెట్ లేనివారికి పదోన్నతులు, ఇంక్రిమెంట్ల విషయంలో ప్రాధాన్యం ఇవ్వొద్దని పేర్కొంది. అయితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విధుల్లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలన్న వినతిని ఎన్‌సీటీఈ తాజాగా పూర్తిగా తిరస్కరించింది. గతంలో ఎంపికైన ఉపాధ్యాయులకు కొంత వెసులుబాటు ఇవ్వాలని సంఘాలు, టీచర్లు రాసిన పత్రాలను తోసిపుచ్చింది.ఇటీవల సుప్రీం కోర్టు తీసుకున్న కీలక నిర్ణయం ప్రకారం, ఏ ప్రభుత్వ టీచర్ అయితే 5 ఏళ్లకు పైగా సర్వీసు పూర్తి చేశాడో, అలాంటి ప్రతీ ఒక్కరూ రెండు సంవత్సరాల వ్యవధిలో టెట్ అనివార్యంగా ఉత్తీర్ణత సాధించాల్సిందే. ఇది ఇటీవల 2017లో పార్లమెంట్‌లో దిద్దుబాటు చేసిన నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న తీర్పు కావడం గమనార్హం. సుప్రీం ధర్మాసనం చెప్పిన తీర్పును 2017లో పార్లమెంట్ చేసిన తీర్మానాన్నే ఆధారంగా చూపారు. అయితే, టీచర్లు తమ నియామకాలు అంతకు ముందు జరిగాయని, కొత్త నిబంధనల ప్రభావం అందరికీ వర్తించకూడదని అభ్యర్థించినా, ఆ వాదనలను ఎన్‌సీటీఈ పరిగణనలోకి తీసుకోలేదు.టెట్ అభ్యర్థన విషయంలో వచ్చిన వినతులను ఎన్‌సీటీఈ తిరస్కరించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర నిరాశ నెలకొంది.



ఇప్పటికే విధుల్లో ఉన్నవారు కూడా టెట్ ఉత్తీర్ణత కీలకంగా మారడంతో, ఉద్యోగ భద్రతపై అనేక మంది ఆందోళన చెందుతున్నారు.

తాజా నిర్ణయానికి కొంతకాలపాటు గరిష్ఠ గడువు ఇచ్చినా, పరీక్ష పాస్ అయేంత వరకు ఒత్తిడి తొలగదు.నూతన విధానాల అమలులో నాన్?టెట్ టీచర్లకు ఇక వెసులుబాటు లేకుండా మారింది. ఎన్నాళ్లుగా డ్యూటీలో ఉ న్నా టెట్ అర్హత తప్పదు. విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేందుకు తీసుకుంటున్న ఈ మార్గం కొంతమందికి సవాళ్లను, మరికొంతమందికి నూతన అవకాశం కావచ్చు.

# నకిలీలు... మోసాలు...

**ఆర్మూరు,తెలంగాణ దిశ :**తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వలసలు కాస్త తగ్గాయి. కానీ ఐదేళ్లుగా మళ్లీ విదేశాలకు వలసలు పెరుగుతున్నాయి. పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ఎన్నో కుటుంబాలకి విదేశీ ఉద్యోగాలంటే గొప్ప ఆశ. స్థిరమైన ఉపాధి, మంచి జీతం, కుటుంబ జీవన ప్రమాణం మెరుగుండా మారుతుందని భావిస్తూ వేల మంది, ముఖ్యంగా గల్ఫ్ దేశాల వెలుపలికి వలస వెళుతున్నారు. నిరక్షరాస్యులు సాదాసీమ ఉద్యోగాలకు సిద్ధపడగా, విద్యావంతులు మెరుగైన అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఉంటున్నారు.విదేశీ మోజును కొందరు ఏజెంటు మోసాలకు పాల్పడుతున్నారు. విదేశాల్లో చోటుచేసే ఉద్యోగ అవకాశాల పేరిట డబ్బులు దండుకుని మోసం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేని సంస్థలు, వ్యక్తులు అక్రమ రీతిలో వలస అవకాశాలు కల్పిస్తున్నారని ప్రతీ ఏడాది కేసులు నమోదవుతున్నాయి. వేలాది మంది రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించి విదేశాలకు వెళ్తున్నారు. అక్కడకు వెళ్లాక సరైన ఉ ద్యోగం లేక మోసపోతున్నారు.నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాలకి చెందిన చాలా మంది ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారు. విదేశాలలో ( జోర్డాన్, ఇజ్రాయెల్ సరిహద్దు) అసాధారణ పరిస్థితుల్లో ఉన్నారు. కొందరు ఏజెంట్లను సంప్రదించగా, 'మీరు అమ్ముడయ్యారు' అనే భయంకరమైన సమాధానం ఇచ్చారు. మూడు లక్షల రూపాయలకు పైగా అప్పులు చేసి విదేశాలకు వెళ్లడం తీరని మోసానికే నిదర్శనం.బాధితులకు కొంత మేర సాయం తోటి తెలుగువారూ, ఎన్నారై సంఘాలూ అందిస్తున్నాయి. కొందరు వారి ద్వారా తల్లిదండ్రుల వద్దకు తిరిగిరాగలుగుతున్నారు. కానీ పెద్దశాతం వలసదారులు విదేశాల్లో దుర్భర జీవితాన్ని కొనసాగే పరిస్థితి. దేశంలో విదేశీ వలసలు, మానవ వనరుల చట్టాల ప్రకారం కన్సల్టెన్సీలు రిజిస్టర్ అయి ఉండాలి. తెలంగాణలో మంజూరైనవి 160 ఉండగా, నకిలీ ఏజెంట్లు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. రెండేళ్లలో వలస మోసాల కేసుల్లో అనేకమంది అరెస్ట్ అయ్యారు.విదేశీ వలసల్లో తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు అక్రమ ఏజెన్సీల మోసాలు, గుర్తింపు ఉన్న సంస్థల కొరత, బాధితులకు వ్యవస్థబద్ధమైన సహాయం లేకపోవడం. మరింత ప్రభావవంతమైన ప్రభుత్వ చర్యలు, ప్రజలకు అవగాహన, చట్టసంబంధ సమాచారం అవసరమన్నది తాజా ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి.

## ముంబైలో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఓ వాణిజ్య భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జోగేశ్వరి వెస్ట్ ఏరియాలోగల జేఎంఎస్ బిజినెస్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పుతున్నారు. భవనం పై అంతస్తులో పలువురు చిక్కుకున్నారు. వారిని కిందకు దించేందుకు రెస్క్యూ టీమ్స్ ప్రయత్నిస్తున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

# తీవ్ర ఆందోళనకరం



దేశ రాజధాని నగరం ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఉదయం విడుదల చేసిన నివేదిక ప్రకారం కాలుష్య కారక సూక్ష్మ కణాల స్థాయి (పిఎం 2.5) గడిచిన ఐదేళ్ల కాలంలోనే అత్యధికంగా నమోదైంది. దీపావళి తరువాత 24 గంటల్లో సగటు పిఎం2.5 సాంద్రత ఒక క్యూబిక్ మీటర్‌కు 488 మైక్రో గ్రాములకు చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) నిర్దేశించిన భద్రతా పరిమితికి దాదాపు 60 రెట్లు అధికం కావడం గమనార్హం. దీంతో ఢిల్లీ నగరమంతా ఒక రకమైన భయానక వాతావరణం నెలకొంది. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడగా అత్యవసరమైన పనులుంటేనే ఇళ్ల నుండి బయటకు రావాలని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించడంతో పరిస్థితి తీవ్రత బోధ పడుతుంది. అనివార్య పరిస్థితుల్లో జాతీయ రాజధాని పరిధి (ఎన్‌సిఆర్) లోని ఢిల్లీ నగరమంతా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి-2) నిబంధనలను అమలులోకి తీసుకువచ్చి సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యుఎం) రంగంలోకి దింపాల్సి వచ్చింది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో ఢిల్లీ ప్రజానీకం శ్వాసకోస సమస్యలతో ఆసుపత్రుల ముందు బారులు తీరుతున్నారు. వీరిలో వృద్ధులు, పసిపిల్లలు ఎక్కువగా ఉన్నారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సిపిసిబి తాజాగా చేసిన విశ్లేషణ ప్రకారం దీపావళి తరువాత సగటు పిఎం2.5 స్థాయి ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. అయితే, గత ఐదేళ్ళ కాలంలో ఈ స్థాయిలో పెరుగుదల లేదు. 2021లో 454.5, 2022లో 168, 2023లో 319.7, 2024లో 220 మైక్రోగ్రాములుగా మాత్రమే నమోదైంది.

నిజానికి, దీపావళికి ముందే ఈ ఏడాది దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రంగా నమోదైంది. అయినా, అత్యున్నత న్యాయస్థానం ముందు జరిగిన విచారణలో ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఢిల్లీలో టపాసుల అమ్మకాల మీద నిషేధాన్ని ఎత్తివేయించేందుకు శక్తివంచన లేకుండా పాటుపడ్డాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పండగపూట టపాసులు కాల్చనీయకుండా ఆప్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందంటూ ఆరోపించిన బిజెపి నేతలు, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే విధంగా వ్యవహరించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కూడా దీపాలతో సరిపెడితే ఎలా అని బాహాటంగానే ప్రశ్నించారు. కేంద్రంతో పాటు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ వైఖరితో గ్రీన్‌క్రాకర్స్ అమ్మకాలకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. గత ఏడాది ఆప్ ప్రభుత్వం దీపావళికి కొద్దిరోజుల ముందు అన్ని రకాల బాణాసంచా విక్రయాలపై నిషేధం విధించినా, ఆ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగిదంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ మతమూ వాతావరణాన్ని కలుషితం చేయమని చెప్ప దని, ప్రాథమిక హక్కుయైన ఆరోగ్యాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వాలు కాపాడి తీరాలని అప్పట్లో స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం తాజాగా దానినుండి వైదొలగడం గమనార్హం. సుప్రీంకోర్టు గ్రీన్ క్రాకర్స్‌కే అనుమతి ఇచ్చినప్పటికీ ఆ పేరుతో అన్ని రకాల బాణాసంచా ఢిల్లీ నగరంలోకి ప్రవేశించింది. కొన్ని పరిమిత గంటల్లోనే బాణాసంచా కాల్చడానికి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన అనుమతి సైతం ఆచరణలో అమలు కాలేదు. ఇప్పుడు పరిస్థితులు చేయి దాటే ప్రమాదం కనపడుతుండటంతో సాక్షాత్తు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సాతో పాటు ప్రభుత్వంలోని మరికొందరు పంజాబ్ రైతులను గడ్డి తగలపెట్టేలఆప్ నేతలు ఒత్తిడి చేశారని, దాని ఫలితంగానే ఢిల్లీలో ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించడం దుర్మార్గం. ప్రజల ను చీల్చి లబ్ధి పొందే ఎత్తుగడలు కాషాయదళానికి కొత్త కాకపోయినప్పటికీ, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత సున్నితమైన అంశాలను కూడా ఇలా వాడుకోవడం దారుణం. ఢిల్లీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా శాశ్వత ప్రాతిపదికన సమగ్ర చర్యలు చేపట్టాలి, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. లేని పక్షంలో దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య రాజధానిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

## ఇంటర్ లో తగ్గిన పాస్ మార్కులు



**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈసాకి కాస్త ముందుగానే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు మొదలవనున్నాయి. మరోవైపు ఇంటర్ పరీక్షల ఫీజు గడువు అక్టోబర్ 22వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత రూ.1,000 ఆలస్య రుసుముతో అక్టోబర్ 30 వరకు ఫీజు చెల్లింపుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల తెలపింది. థియరీ పేపర్లకు రూ.600, ప్రాక్టికల్స్‌కు రూ.275, బ్రిడ్జికోర్సు సబ్జెక్టుకు రూ.165 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అయితే 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థుల పాస్ పర్సంటేజీ, పాస్ మార్కుల విధానంలోనూ కీలక మార్పులు రానున్నాయి. ఈ మేరకు తాజాగా ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇంటర్ జాగ్రఫీ పేపర్ మార్కుల విధానంలో గతంలో మాదిరి 35 శాతం మార్కులు రావల్సిన అవసరం లేదు. ఇకపై కనీసం 30 మార్కులు వచ్చినా ఉత్తీర్ణత పొందినట్లుగానే పరిగణిస్తారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఫస్ట్ ఇయర్ రెగ్యులర్ విద్యార్థులకు జాగ్రఫీ ప్రశ్నపత్రం 75 మార్కులకు ఉంటుంది. దీన్ని 85 మార్కులకు చేశారు. కొత్త మార్పులతో జాగ్రఫీని ఎలెక్టివ్ (ఛాయిస్) సబ్జెక్టుగా పరిగణిస్తారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రంతో సమానంగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. అంటే జాగ్రఫీ ప్రాక్టికల్ పరీక్షలను 50 మార్కులకు బదులు 30 మార్కులకు నిర్వహిస్తారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలో కనీసం 35 శాతం అంటే 11 మార్కులు రావాల్సి ఉంటుంది. దీన్ని 30%కి తగ్గించడంతో 9 మార్కులు వస్తే ఉత్తీర్ణత పొందినట్లుగా పరిగణిస్తారు. 2025-26 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ అభ్యర్థులుగా ప్రవేశం పొందిన ఇంటర్ విద్యార్థులకు మాత్రమే ఇది వర్తిస్తుం.

## అలజడి రేపుతున్న కొలికపూడి



**విజయవాడ,తెలంగాణ దిశ :** టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మరోసారి అలజడి రేపారు. తిరువూరులోఆయన మాట్లాడుతూ ఎంపీ కేశినేని చిన్నిపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు మరో సారి రచ్చకెక్కాయి. మరోవైపు కొలికపూడిపై టీడీపీ నేతలు ధ్వజమెత్తు తున్నారు. ప్రశాంతంగా ఉన్న తిరువూరులో కావాలనే కలకలం రేపుతున్నారని మండిపడుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిని టార్గెట్ చేస్తూ కొలికపూడి తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ పదవులు అమ్ముకుంటూ అవినీతి పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో పార్టీ పదవులు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో లీడర్లు తిరిగే వాళ్లని ఇప్పుడు ఎంపీ కార్యాలయంలోనే కూర్చొని పదవులు డబ్బులు ఇచ్చే వాళ్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రేషన్ మాఫియా, ఇసుకు మాఫియా నడుపుతూ పార్టీ పదవులు అమ్ముకుంటున్నారని అన్నారు. ఎంపీ కార్యాలయంలోని మూల్పూరి కిశోర్ చేస్తున్న దందాతో పార్టీ నేతలకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ కార్యాల యం కేంద్రంగా సాగుతున్న దందాను అధినాయకత్వం దృష్టికి తీసుకె ళ్తామన్నారు కొలికపూడి. ఈ నెల 24న రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివా సరావును కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. తిరువురులో జరుగుతున్న పరిణామాలు వివరిద్దామని కార్యకర్తలకు సూచించారు. అయితే ఎంపీపై కొలికపూడి చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. దీంతో కొలికపూడిపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో రాజకీయ అలజడి రేపుతున్నారని ఆగ్రహంతో ఉన్నారు. కొలికపూడి మద్యం దుకాణాల నుంచి నెల నెల వసూళ్లు చేస్తున్నారని, మట్టి మాఫీయను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులబదిలీల కోసంకూడా కొలికపూడిడబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కూడా కొలికపూడి ఏదో రకంగా వార్తాల్లో ఉంటూ వస్తున్నారు. పార్టీలో తిరుగుబాటు చేస్తూ, ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తూ ఇప్పటికే అధిష్ఠానం వద్ద పలుమార్పులు క్లాస్‌లు కూడా తీసుకున్నారు. ఇప్పుడు మరో కొత్త వివాదంతో మరోసారి సంచలనంగా మారుతున్నారు. పలు మార్లు చంద్రబాబు, ఇతర నేతలు పిలిచి ఆయనకు హితబోధ చేశారు. కానీ ఆయనలో మార్పు కనిపించలేదు.

## కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలి: డిజిఎం క్వాలిటీ


**కమాన్ పూం,తెలంగాణ దిశ :** కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలని రామగుండం-3 ఏరియా క్వాలిటీ విభాగాధిపతి బి.వి. సత్య నారాయణ అన్నారు.రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఆర్.జి-3, ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియాల కళాకారుల మధ్య రీజినల్ స్థాయి సాంస్కృతిక (కల్చరల్) పోటీలను నిర్వహించారు. ఇట్టి పోటీలను రామగుండం-3 ఏరియా క్వాలిటీ విభాగాధిపతి బి.వి.సత్య నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం ప్రతి సంవత్సరం వివిధ కళలకు సంబంధించిన పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండా కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, డివై పిఎం వి.సునీల్ ప్రసాద్, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య, ఇతర నిర్వాహకులు, కళాకారులు పాల్గొన్నారు.



## 300 ఇళ్లు...350 సర్కార్ కొలువులు

**కడప,తెలంగాణ దిశ :** కడపలోని పెద్ద తండా గ్రామం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. 300 ఇళ్లున్న ఈ మారుమూల తండాలో.. ఒక్కరు ఇద్దరూ కాదు.. ఏకంగా 350 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. కనీస సౌకర్యాలు లేని ప్రాంతం నుంచి వచ్చిన ఈ తండా వాసులు విద్య విలువను గుర్తించి కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారు. పేదరికాన్ని జయించి, బాగా చదువుకుని ప్రభుత్వ కొలువులు సాధించారు. ఇళ్ల కన్నా.. ఎక్కువ సంఖ్యలో ఉద్యోగస్తులు ఉండటం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది. కొన్నాళ్ల క్రితం వరకు కూడా ఊరికో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే చాలా గొప్పగా భావించేవారు. అయితే ఇప్పుడు చాలా మంది యువత ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకుని ఆదిశగా కష్టపడుతున్నారు. కనుక ప్రతి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరుగుతోంది. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే గ్రామం మాత్రం వీటన్నింటికి భిన్నం. ఇక్కడ మొత్తం ఇళ్ల సంఖ్య 300 అయితే ఉద్యోగాలు చేసే వారి సంఖ్య.. 350. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులే అధికం. అవును మీరు విన్నది నిజమే. ఇక్కడి చాలా ఇళ్లలో తప్పనిసరిగా ఓ ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు. కొన్ని ఇండ్లలో ఇద్దరు, ముగ్గురు కూడా ఉన్నారు. మరి ఇంత మంది ప్రభుత్వ కొలువులు సాధించారంటే ఇదేదో బాగా అభివృద్ధి చెందిన ప్రాంతం, పట్టణాలకు దగ్గరగా ఉన్న ప్రాంతం అనుకుంటే పొరపాటే.ఇదొక మారుమూల తండా. కనీస సౌకర్యాలకు ఆమడ దూరంలో ఉంది ఈ తండా. ఇక్కడ నుంచి కాలేజీకి వెళ్లాలంటే.. 50 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఇంటికి దగ్గర్లోనే బడి ఉన్నా.. చదువుకోమంటే బద్దకించే వారు ఎందరో ఉన్నారు. కానీ ఈ తండా వాసులు మాత్రం అలా కాదు. వారికి చదువు విలువ తెలుసు. అందుకే గ్రామంలోని చాలా మంది బాగా చదువుకుని ప్రభుత్వ కొలువు సాధించి.. ఎందరికో ఆదర్శంగా




నిలుస్తున్నారు. మరి ఇంతకు ఈ తండా ఎక్కడ ఉంది అంటే.... కంభంవారిపల్లి మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పరిధిలో ఉంది పెద్ద తండా. ఇది చుట్టు పక్కల గ్రామాలకు ఆదర్శరంగా నిలుస్తుంది. సుమారు 40 సంవత్సరాల క్రితం ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. వైద్యం, విద్య తండా వాసులకు అందని ద్రాక్ష. అలాంటి గ్రామం నేడు జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. ఊళ్లో ఇక్కడ సుమారు 300గడపలు ఉంటే.. ఉద్యోగులు సుమారు 350మంది ఉన్నారు. అటవీ ప్రాంతం కావడంతో ఈ గ్రామస్తుల పుర్వీకులు.. కట్టెలు కొట్టి, అడవిని నమ్ముకొని జీవనం సాగించేవారుఅయితే తమలానే తమ పిల్లలు కష్టపడకూడదని భావించిన వారు.. పిల్లలను బాగా చదివించారు. పిల్లలు కూడా తల్లిదండ్రుల కష్టాన్నిఅర్థం చేసుకుని.. బాగా చదివారు. ఎక్కువ మంది పట్టణ ప్రాంతాల్లోని వసతి గృహాల్లో ఉంటూనే చదివి, ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం గ్రామంలో టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, పోలీసులు, బ్యాంకు మేనేజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, టీటీడీ ఉద్యోగులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారు. వీరంతా నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారే కావడం విశేషం. పేదరికానికి భయపడకుండా బాగా చదవి.. మంచి ఉద్యోగం సాధించి.. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

## మూడేళ్ల ముందు నుంచే ప్రచారం

**విజయవాడ,తెలంగాణ దిశ:**ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల టైమ్ ఉంది. కానీ రేపో మాపో ఎలక్షన్ అన్నట్లుగా..సీఎం చంద్రబాబు అప్పుడే ప్రచారం స్టార్ట్ చేశారు. ఎక్కడికి వెళ్లినా మీ ఓటు మాకేనని అభ్యర్థిస్తున్నారు. ప్రతీ అంశంలో ప్లస్‌లు, మైనస్‌లు బేరీజు వేసుకుని మరీ ముందుకెళ్తున్నారు. కూటమిలో గ్యాప్ రాకుండా..ప్రజల్లో ప్రభుత్వంపై బ్యాండ్ నేమ్ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే.. ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని డిసైడ్ అయ్యారు.రేపే నోటిఫికేషన్. పది రోజుల్లో ఎలక్షన్స్. ఈ ఎన్నికలు చాలా కీలకం అన్నట్లుగా ఉంది ఏపీ రాజకీయం. ఇష్యూ ఏదైనా..టాపిక్ మరేదైనా అధికార, విపక్షాలు ప్రతీదాన్ని అడ్వాంటేజ్‌గా మల్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు పొలిటికల్ స్టెప్పులు ఆసక్తికరంగా మారాయి. కూటమిగా అధికారంలోకి వచ్చి 15 నెలలు అయిందో లేదో..అప్పుడే రాబోయే ఎన్నికల కసరత్తును స్పీడప్ చేశారు.ఏపీలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు 2029 మేలో జరుగుతాయి. అప్పటివరకు పాలన చూసుకుంటూ నెట్టుకురావొచ్చు. కానీ నాలుగోసారి సీఎంగా బాబు ప్రమాణం చేసిన మరుసటి రోజు నుంచే..రేపటి కోసం ఫ్యూచర్ ప్లాన్ నడుస్తూనే ఉంది. రేపే ఎన్నికలు ఉన్నాయా అన్నట్లుగా..కార్యక్రమాలు..కూటమి ప్రభుత్వ పాలన..సంక్షేమ పథకాలు..ఇలా అన్నీ బ్యాలెన్స్ చేస్తున్నారు. ఎక్కడికెళ్లినా కూటమికి వెన్నుదన్నుగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు. మళ్లీ వైసీపీ వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఉదాహరణలతో మరీ చెబుతున్నారు. ఏ పథకం అయినా కార్యక్రమం అయినా జనం మధ్యనే చేస్తున్నారు.ఇక ఇప్పటికే సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్ అంటూ డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేసింది కూటమి. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సీఎం చంద్రబాబే గ్రౌండ్‌లోకి దిగేందుకు రెడీ అవుతున్నారు. నవంబర్ నెల నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తాను అని బాబు ప్రకటించేశారు. ప్రజల దగ్గరికే వెళ్లి పథకాల అమలుపై ఆరా తీయాలని..అలా అయితే ఏవైనా లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అప్పటి దాకా ప్రజల మధ్యనే ఉండేలా ప్రణాళిక రచిస్తున్నారట.పబ్లిక్ పల్స్‌ను పట్టుకోవడంలో చంద్రబాబు మార్క్ వేరే. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ. పైగా గ్రౌండ్ లెవల్‌లో ఏం జరుగుతుందో..జనం ఒపీనియన్ ఏంటో ఎప్పటికప్పుడు రిపోర్టులు తెప్పించుకుని స్టడీ చేయడం బాబుకు ముందు నుంచి అలవాటుగా ఉందట. ఎప్పటికప్పుడు సర్వేలు కూడా చేయించుకుంటూనే ఉన్నారు. వీటన్నింటికీ మించి ఫస్ట్ రిపోర్టులాగా..క్షేత్రస్థాయిలో పర్యటిస్తే..జనాల ఒపీనియన్ తెలుసుకోవచ్చని అనుకుంటున్నారట. ఇక 2029 ఎన్నికల్లో కూడా మొన్నటి లాగే..అద్భుతమైన విజయం సాధించాలంటే ఏమి చేయాలనేదానిపై గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు. విపక్షం ఇంకా ఫీల్డ్‌లోకి దిగకముందే ఓ అడుగు ముందుకేసి పబ్లిక్‌కు దగ్గర కావొచ్చని ప్లాన్ వేస్తున్నారట చంద్రబాబు.అటు వైసీపీ కూడా ఇన్ హౌజ్ మీటింగ్‌లో బిజీగా ఉంది. ఘోర పరాజయం..నేతల జంపింగ్‌లు..లీడర్ల అరెస్టులు..ఆ తర్వాత లిక్కర్ స్కామ్ కేసు..ఇలా వరుస ఇష్యూలతో స్ట్రగుల్స్ ఫేస్ చేసిన వైసీపీకి..ఈ మధ్య ప్రభుత్వాన్ని కార్నర్ చేసేందుకు రెండు పెద్ద ఇష్యూస్ తగిలాయి. నకిలీ మద్యం వ్యవహారం.. మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై..స్ట్రాంగ్ వాయిస్ వినిపించి..ప్రొటెస్ట్‌లు, విమర్శలు..అలిగేషన్స్‌తో..కూటమి సర్కార్‌పై కాస్త గట్టిగానే వాయిస్ రేజ్ చేసి జనం దృష్టిని ఆకట్టుకోలిగింది.ఇలా ఎప్పటికప్పుడు ఇష్యూ బేస్డ్‌గా జనంలోకి వెళ్తూ..ఎన్నికల వ్యూహ రచనలో కూడా జగన్ బిజీగా ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. మిర్చి, మామిడి రైతుల పక్షాన జగన్ పర్యటనలు చేసి చర్చకు తెరలేపారు. లేటెస్ట్‌గా మెడికల్ కాలేజీ అంశాన్ని వైసీపీ చాలా బలంగా జనాల్లోకి తీసుకెళ్లింది. వైసీపీ నేతల మెడికల్ కాలేజీల టూర్లతో పాటు..మాజీ సీఎం జగన్ నర్సీపట్నంలో పర్యటించిన మెడికల్ కాలేజీ పీపీపీ విధానంపై కూటమి సర్కార్ తీరును తప్పుబట్టారు.ఇక జిల్లాల పర్యటన చేస్తానని గతంలోనే ప్రకటించిన ఫ్యాన్ పార్టీ అధినేత..ముందుగా నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ లీడర్, క్యాడర్‌కు భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. మరోసారి రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా జగన్ ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. అది ఎప్పుడు ఉంటుందో ఇప్పటికి క్లారిటీ లేదు. అయితే జిల్లాల టూర్ లేక పాదయాత్రకు సంబంధించి త్వరలో షెడ్యూల్ ఇచ్చి వైసీపీ కూడా ప్రజాక్షేత్రంలోకి దిగబోతోందట.అయితే ఫ్యాన్ పార్టీ ఇప్పటి నుంచే పబ్లిక్‌లోకి వెళ్లడమనేది అపోజిషన్ పార్టీగా వాళ్లకుతప్పదు. కానీ అధికారంలోఉన్న కూటమిఇప్పుడే అలర్ట్ అవడం.. క్షేత్రస్థాయి పర్యటనకు సీఎం చంద్రబాబు రెడీ అవుతుం డటం ఇంట్రెస్టింగ్‌గా మారింది. మొత్తానికి ప్రభుత్వం మారి రెండేళ్లు కాకముందే ఏపీలో రాజకీయం రంజుగా మారేలా కనిపిస్తోంది.

# సినిమా..

## మరిన్ని భాషల్లో కిష్కింధపురి




బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ కాంబోలో వచ్చిన చిత్రం కిష్కింధపురి. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో ఫాంటసీ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ మూవీ సెప్టెంబర్ 12న విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. కాగా కిష్కింధపురి మరోవైపు డిజిటల్ ప్లాట్‌ఫాంలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు ఓటీటీలోకి కూడా ఎంట్రీ ఇచ్చిందని తెలిసిందే. కిష్కింధపురిప్రస్తుతం వన్ ఆఫ్ ది లీడింగ్ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. ఓటీటీలో ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. కిష్కింధపురి ఇక తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. కిష్కింధ పురి చిత్రాన్ని అక్టోబర్ 24 నుంచి ఆయా భాషల్లో చూసేయొచ్చు. మరిన్ని భాషల్లో స్ట్రీమింగ్ అవుతుండటంతో ప్రేక్షకుల సంఖ్య కూడా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇంకేంటి మీకు ఏ భాషలో చూడాలనిపిస్తే ఆ భాషలో చూసేయండి మరి. అయితే హిందీ వెర్షన్‌కుసంబంధించి మాత్రం ఎలాంటి అప్‌డేట్ రాలేదు. కిష్కింధ పురిలో సాండీ మాస్టర్, హైపర్ ఆది, ప్రేమ, తనికెళ్లభరణి ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి చేతన్ భరద్వాజ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ సినిమాను నిర్మించారు.

## గుమ్మడి నర్సయ్యగా శివరాజ్‌కుమార్..



పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ వేత్తగా, ప్రజా నాయకుడిగా గుమ్మడి నర్సయ్యకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పేరు ప్రఖ్యాతుల గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. నిజమైన రాజకీయ నాయకుడు అంటే ఇలా ఉండాలి.. అనేలా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది ఇల్లందుకు చెందిన గుమ్మడి నర్సయ్య ప్రస్థానం. ఇప్పుడు ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై సందడి చేయనుంది. ఈ చిత్రానికి గుమ్మడి నర్సయ్య టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఆయన పేరునే టైటిల్‌గా ఫిక్స్ చేసి మొదటి ప్రయత్నంలోనే అందరి ఫోకస్ తనవైపునకు తిప్పుకుంటున్నాడు డైరెక్టర్. కన్నడ స్టార్ యాక్టర్ శివరాజ్‌కుమార్ కు తెలుగులో కూడా సూపర్ ఫ్యాన్ బేస్ ఉందని తెలిసిందే. ఈ కరుణాడ చక్రవర్తి శివరాజ్‌కుమార్ గుమ్మడి నర్సయ్యగా కనిపించబోతున్నాడు. తెలుగు రంగు చొక్కా, ధోతిలో భుజాన ఎర్ర కండువా వేసుకుని సైకిల్‌ను తోసుకుంటూ వెళ్తున్నాడు. సైకిల్ హ్యాండిల్‌కు సీపీఐఎంఎల్ జెండాను చూడొచ్చు. అసెంబ్లీ ముందు నుంచి మిగిలిప ప్రజాప్రతినిధులంతా బుగ్గ కార్లలో వస్తుంటే.. గుమ్మడి నర్సయ్య మాత్రం సాదాసీదాగా సామాన్య వ్యక్తిలా సైకిల్‌తో రావడం గమనించవచ్చు. ఫస్ట్ లుక్‌తోనే సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తూ.. అందరినీ ఆలోచింపజేసేలా సినిమా ఉండబోతున్నట్టు తెలియజేశాడు డైరెక్టర్ పరమేశ్ హివ్‌రాలే. ఈ చిత్రాన్ని ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎన్ సురేశ్ రెడ్డి నిర్మిస్తున్నారు. సురేశ్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. చిరు గొడవలు, లావణ్య విత్ లవ్ బాయ్స్ సినిమాల్లో నటించిన పరమేశ్ హివ్‌రాలే ఈ సినిమాతో డైరెక్టర్‌గా మారుతుండటంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్.

## సమంత ఎమోషనల్ కామెంట్స్ ..

## నా విడాకుల సమయంలో కొంతమంది సంబరాలు చేసుకున్నారు



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తన అందం, నటన, కష్టపడి పనిచేసే ధోరణితో స్టార్ హీరోయిన్లలో అగ్రస్థానంలో నిలిచిన ఈ బ్యూటీ ప్రొఫెషనల్ లైఫ్‌లో ఎంత సక్సెస్ సాధించిందో, పర్సనల్ లైఫ్‌లో మాత్రం అంతగా అదృష్టం కలసిరాలేదు. నాగ చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత సమంత ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తోంది. కొంతకాలం ఆమె మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడింది. ఆ సమస్య నుంచి కోలుకున్న సమంత మళ్లీ సినిమాలపై దృష్టి సారిస్తోంది.ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సమంత మాట్లాడుతూ.. నా కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. నన్ను ద్వేషించే వాళ్లు నా దుస్థితిని చూసి నవ్వుకున్నారు. నాకు మయోసైటిస్ వచ్చినప్పుడు కూడా కొంతమంది ఎగతాళి చేశారు. ఇంకా నా విడాకుల సమయంలో వారు సంబరాలు చేసుకున్నారు. నా జీవితంపై వ్యాఖ్యానిస్తూ, నా భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకున్నట్టుగా మాట్లాడారు. అవన్నీ చూసి చాలా బాధపడ్డాను. కానీ తర్వాత నుంచి ఎవరి గురించి పట్టించుకోవడం మానేశాను అని సమంత ఎమోషనల్‌గా చెప్పింది.ఈ కామెంట్స్ నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అభిమానులు ఆమె ధైర్యం, బలమైన మనసుకు ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలామంది "సమంత నిజమైన ఫైటర్", "ఆమెను కిందపడేయాలని చూసిన వాళ్లందరికీ ఇదే సమాధానం" అంటూ సపోర్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం సమంత బాలీవుడ్‌లో "రక్త్ బ్రహ్మాండ్" అనే సినిమాతో బిజీగా ఉంది. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకులు రాజ్ %డ% డీకే తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇదిలా ఉండగా, సమంత త్వరలో తెలుగులో మరో సినిమాతో రీఎంట్రీ ఇవ్వబోతోంది. ఆ సినిమా పేరు "మా ఇంటి బంగారం". ఈ చిత్రాన్ని దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో ముందుగా వచ్చిన " బేబీ" సినిమా సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అందువల్ల "మా ఇంటి బంగారం"పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ–ప్రొడక్షన్ దశలో ఉండగా, రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

## లవ్ ఓటీపీ ట్రైలర్ రిలీజ్



శ్రీమతి పుష్ప మణిరెడ్డి సమర్పణలో భావప్రీత ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అనీష్ హీరోగా స్వీయ దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'లవ్ ఓటీపీ'. విజయ్ ఎం రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. రాజీవ్ కనకాల, జాన్విక కీలక పాత్రలో నటించిన ఈ సినిమా నవంబర్ 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంతో తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ లాంచింగ్ ఈవెంట్‌లో రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. లవ్ ఓటీపీ చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో చిత్రీకరించామని తెలిపారు. ఈ సినిమాతో అనీష్ తెలుగు సినీ ఇండస్ట్రీకి అడుగుపెడుతున్నారని పేర్కొన్నారు. రాజమౌళిలా అన్ని క్రాఫ్ట్‌ల మీద పట్టున్న అనీష్‌కు మంచి పేరు రావాలని ఆకాంక్షించారు. హీరో, దర్శకుడు అనీష్ మాట్లాడుతూ .. 'హీరో అవ్వాలని చిన్నప్పటి నుంచీ కలలు కంటుండేవాడిని. అదే విషయాన్ని మా నాన్న గారికి చెప్పాను. ఆయన సాయంతో ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. వైజాగ్ మూర్తి వద్ద యాక్టింగ్ నేర్చుకున్నాను. అల్లు అర్జున్‌తో కలిసి షెడ్డులో డ్యాన్స్ ప్రాక్టీస్ చేశాను. 'నెలవంక' మూవీ ఓపెనింగ్స్‌కిబన్నీ కూడా గెస్టుగా వచ్చారు. అయితే ప్రొడక్షన్ లోకి వద్దు అని బన్నీ సలహా ఇచ్చినా నేను వినలేదు. ఆ మూవీ తరువాత నేను కన్నడకు వెళ్లిపోయాను.' అని తెలిపారు. 'గౌతమ్ తిన్ననూరి కూడా మంచి స్నేహితుడు. 'మళ్లీ రావా' కూడా మిస్ అయింది. ఎప్పటి నుంచో మళ్లీ తెలుగులోకి రావాలని చాలా ప్రయత్నాలు చేసివిఫలం అయ్యాను. మళ్లీ ఇప్పుడు ఇలా ఇన్నేళ్లకు టెక్నీషియన్‌గా, దర్శకుడిగా, హీరోగా ఆడియెన్స్ ముందుకు వచ్చాను.' అని పేర్కొన్నారు. కంటెంట్‌ను నమ్మి ఈ సినిమాను చేశామని అన్నారు. అందుకే 10 రోజుల ముందే ఈ సినిమాను మీడియాకు చూపించాలని అనుకుంటున్నామని వెల్లడించారు. అందరూ చూసి ఈ సినిమాను సపోర్ట్ చేస్తారని ఆకాంక్షించారు.

## అందుకే ఆ సినిమా ఒప్పుకున్నా..



జయాపజయాల సంగతి అటుంచితే.. మంచి నటిగా మాత్రం గుర్తింపు తెచ్చుకుంది శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అతికొద్ది సమయంలోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నది ఈ భామ. ఈ మధ్యకాలంలో విడుదలైన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి సినిమాలు అనుకున్నంతగా ఆడకపోయినా.. జాన్వీకి మాత్రం మంచి పేరే తెచ్చిపెట్టాయి. రీసెంట్‌గా కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఓ యాక్షన్ డ్రామాలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది జాన్వీ. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధానపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో నటించేందుకు తానెందుకుఒప్పుకున్నానో తెలుపుతూ 'కేవలం రొమాంటిక్ పాత్రలే కాదు, ఏజానర్ సినిమాలైనాచేయగలనని నిరూపించుకోడానికే ఈ సినిమాకుసైన్ చేశాను. ఇది యాక్షన్,రివైంజ్, ఇంటెన్స్ డ్రామా. ఇందులో నాది స్ట్రాంగ్ క్యారెక్టర్. ఎనర్జీ, ఎమోషన్, మరింత బలంగా చూపించే అవకాశం ఈ పాత్రలో ఉన్నది' అని జాన్వీ తెలిపింది.

## టాలీవుడ్ ట్రీట్స్

నవంబర్ నెల టాలీవుడ్ కి ఎంతో స్పెషల్ కాబోతుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు,రాజమౌళి సినిమాకు సంబంధించిన ఒక కీలక అప్డేట్ గ్రాండ్ గా రివీల్ కాబోతుంది. దీని కోసం టాలీవుడ్ మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు మొత్తం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ ఈవెంట్ కి అవతార్ మూవీ డైరెక్టర్ జేమ్స్ కెమరూన్ కూడా రాబోతున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్. ఆ రోజు ఆయన చేత టైటిల్ ని రివీల్ చేయించడమే కాకుండా, ఒక గ్లింప్స్ వీడియో ని కూడా విడుదల చేయించబోతున్నారట. దీని తర్వాత ప్రభాస్, రామ్ చరణ్ వరుసగా తమ అభిమానులకు ట్రీట్ ఇవ్వబోతున్నారు. ప్రభాస్ ప్రస్తుతం 'రాజా సాబ్' మూవీ షూటింగ్ లో బిజీ గా ఉన్న సంగతి తెలిసిందే. టాకీ పార్ట్ మొత్తం పూర్తి అయ్యింది కానీ, సాంగ్స్ చిత్రీకరణ మాత్రం బ్యాలన్స్ ఉండిపోయింది.ప్రస్తుతం ఆ సాంగ్స్ చిత్రీకరణ పనిలో ఉంది మూవీ టీం. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు కూడా సోషల్ మీడియా లో లీకై బాగా వైరల్ అయ్యాయి. ఇదంతా పక్కన పెడితే ఈ సినిమాలోని మొదటి లిరికల్ వీడియో సాంగ్ ని నవంబర్ మొదటి వారం లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు అట. ఓజీ మూవీ మ్యూజిక్ తో యూత్ ఆడియన్స్ ని ఒక ఊపు ఊపిన థమన్, ఈ చిత్రానికి కూడా సంగీతం అందించాడు. ప్రభాస్ కి మొట్టమొదటిసారి పనిచేయడంతో ది బెస్ట్ ఇచ్చేందుకు అన్ని విధాలుగా ప్రయత్నం చేసాడట థమన్. మొదటి పాటతోనే సిక్సర్ ని కొట్టాలి, ఆడియన్స్ దృష్టిని ఆకర్షించాలి అనే లక్ష్యం తో ఉంది మూవీ టీం. అందుకు తగ్గట్టు గానే మొదటి పాటని డిజైన్ చేశారట. ఇందులో ప్రభాస్ డ్యాన్స్ కూడా మేజర్ హైలైట్ గా ఉండబోతుందని టాక్.మరోపక్క గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా తన అభిమానులకు స్వీట్ సర్ప్రైజ్ ఇవ్వబోతున్నాడు. ప్రస్తుతం బుచ్చి బాబు తో ఆయన 'పెద్ది' అనే చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ ని అందిస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మొదటి లిరికల్ వీడియో సాంగ్ ని కూడా నవంబర్ నెలలోనే విడుదల చేయబోతున్నారట. అలా నవంబర్ లో స్టార్ హీరోల సినిమాలు విడుదల కాకపోయినా, వాళ్ళ కొత్త సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ తో అభిమానులను వరుసగా ఉక్కిరిబిక్కిరి చేయబోతున్నారు. 'రాజా సాబ్' చిత్రం జనవరి 9 న విడుదల కాబోతుండగా, 'పెద్ది' చిత్రం మార్చి 26 న విడుదల కాబోతుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215